తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

సోమవారం 07.09.2026 | సంపుటి : 13 సంచిక : 49 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698

సామాన్యుని స్వరం JANAMSAKSHI TV

# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన

# ఫ్లాప్‌షో..

## ప్రభుత్వాన్ని నిలదీయండి:కేసీఆర్

కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్. తమ ప్రభుత్వం మళ్లీరాదని కాంగ్రెస్ నేతలకు అర్థమైంది. అందుకే అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. నా చావు కోరుతూ పదేపదే మాట్లాడుతున్నారు. పాలన చేతకాకే సీఎం రేవంత్‌రెడ్డి బూతు పురాణం అందుకున్నారు. అలాంటి వ్యక్తితో చర్చకు అసెంబ్లీకి రావాలా?సమావేశాల్లో అధికార పార్టీ నేతలు నా గురించి మాట్లాడే యత్నం చేస్తే పట్టించుకోవద్దు. శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజల అజెండానే బీఆర్‌ఎస్ అజెండాగా ఉండాలి. కాంగ్రెస్, భాజపా విధానాలను ఎండగట్టాలి. స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలపై నిలదీయాలి. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాల పైనే పోరాడాలి. రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోంది. కృష్ణా, గోదావరి జలాల అంశంపై ఉద్ధృత పోరాటం చేయాలి. రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదు? కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల వద్దకు వెళ్దాం. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుంది" - కేసీఆర్

సిద్దిపేట (జనంసాక్షి): కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, పార్టీ ఎమ్మెల్యేలు,

మిగతా 2లో..





- ప్రజల అజెండాగానే ముందుకు సాగాలి
- పాలన చేతకాకే సీఎం రేవంత్ అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారు
- అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా?
- హామీల అమలు, నదీజలాల అంశంపై ప్రభుత్వాన్ని గట్టిగా పోరాడాలి
- ఎర్రవల్లిలో మాజీ సీఎం అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశా నిర్దేశం
- సమావేశాలు నెలరోజులు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం
- తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికీ వెనకాడం: హరీశ్‌రావు

# కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్

# మహాధర్నా

## ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలి

### ప్రజలు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే ఆయన మాత్రం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు

నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ప్రజలు పోరాడి స్వరాష్ట్రం సాధించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ఉన్నత చదువులు చదివితే సరిపోదు.. సంస్కారం కూడా ఉండాలని కేటీఆర్ గ్రహించాలి. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. నగరానికి అనుబంధంగా ఫ్యూచర్‌సిటీ మరో గొప్ప నగరంగా ఎదుగుతోంది. సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల.. పదేళ్లపాటు నెరవేరలేదు. ప్రతి నియోజకవర్గానికీ 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం" - మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నేత హోదాకు మాజీ సీఎం కేసీఆర్ న్యాయం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రజలు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దని.. అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలని హితవు పలికారు. "నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ప్రజలు

మిగతా 2లో..





- ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దు
- అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలి
- నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ స్వరాష్ట్ర పోరాటం
- ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి
- ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం
- విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం
- పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మహేశ్‌కుమార్‌గౌడ్
- బీఆర్ఎస్ వైఖరి మారకపోతే.. మరో పదేళ్లు రోడ్లపైనే: మంత్రి శ్రీధర్ బాబు

# ఆందోళన విరమించండి

## ఉద్యోగుల సమస్యలు పరిష్కారిస్తాం

### ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధతతో పనిచేస్తోంది : డిప్యూటీసీఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి): ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోంది. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వసించే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్పష్టంగా చెప్పారు. ఆదివారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన హెల్త్ కార్డు పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమవారేనని, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు చేసిందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం ఆలోచన చేసి తీసుకొచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈహెచ్ఎస్ పథకంలో ఇప్పటికే 354 ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా, మరికొన్ని ఆసుపత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్లు ఆయన చెప్పారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, పథకం

మిగతా 2లో..

# నర్సు హత్య ఘటనపై మేజిస్టీరియల్ విచారణ

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సత్వర న్యాయం అందించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



హైదరాబాద్(జనంసాక్షి): ఇటీవల హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా మేజిస్టీరియల్

మిగతా 2లో..

# తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు టెండర్లు

టీజీరెడ్కో కీలకచర్యలు

వార్త 2 లో

# రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- ఆర్థిక ఇబ్బందులున్నా హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం
- అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పరిశీలన



కోదాడ(జనంసాక్షి): రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. కోదాడ నియోజకవర్గంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పనులను ఆదివారం ఆయన విస్తృతంగా పరిశీలించారు. ప్రతి పనికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కోదాడ పట్టణంలో బాలాజీనగర్‌లో రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయ భవన నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందేలా భవన నిర్మాణం చేపట్టాలని సూచించారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెడ్లకుంటలో ఎత్తిపోతల పథకం పనులు. రూ.55 కోట్లతో నిర్మాణం.. రైతులకు సాగునీరు అందేలా చర్యలు.కోదాడ మండలం రెడ్లకుంటలో రూ.55 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల

మిగతా 2లో..



# మత్తు రహిత దేశంగా మారుస్తాం

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం

పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం :అమిత్‌షా

న్యూఢిల్లీ(జనంసాక్షి): డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా

మిగతా 2లో..

# విద్యాలయాల రాజకీయ ప్రచారాలేనా..?



## ప్రధాని మోదీపై మల్లికార్జున ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ 'యాంగ్రీ అంకుల్' వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. దిల్లీ యూనివర్సిటీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో మాట్లాడిన ప్రధాని మోదీ విద్య, ఉద్యోగాలు, యువజన సంక్షేమం గురించి మాట్లాడకుండా, దానిని రాజకీయ ప్రచారంగా మార్చేశారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై రాజకీయ ముద్రలు వేస్తున్నారని విమర్శించారు. విమర్శనాత్మక ప్రశ్నలను అణచివేయడానికి, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి విపక్షాలను కించపరిచే విశేషణాలను వాడడం ఆయనకు అలవాటుగా మారిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు."ప్రధాని మోదీ- మీరు నిన్న దిల్లీ యూనివర్సిటీలోని ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై

మిగతా 2లో..

# హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

- పలువురు కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు
- కొండా సురేఖ, సీనియర్ నేత చిన్నారెడ్డితో ఎలాంటి విభేదాలు లేవు : మల్లు రవి

2లో..

# ఢిల్లీలో కుప్పకూలిన వసతి గృహం

శిథిలాల కింద పలువురు విద్యార్థులు..!

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని దిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఓ భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో భవనం కూలినట్లు సమాచారం అందగానే.. సహాయక సిబ్బంది, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. శిథిలాలను తొలగించే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

మిగతా 2లో..



# ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల పోరుబాట

- విధానపరమైన నిర్ణయాలపై స్పష్టత ఇవ్వండి
- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌కు ఉద్యోగ సంఘాల లేఖ
- స్టార్టప్ లను ప్రోత్సహించే నెపంతో ఇస్రో పాత్రను పరిమితం చేస్తున్నారు
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):స్టార్టప్‌లను ప్రోత్సహించే నెపంతో మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పాత్రను పరిమితం చేస్తోందని కాంగ్రెస్ ఆదివారం ఆరోపించింది. దశాబ్దాలపాటు ఎంతో శ్రమించి ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను, దీర్ఘకాలిక నిబద్ధతపై నమ్మకం లేని ప్రైవేటు కంపెనీలకు బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఇస్రో ప్రైవేటీకరణకు సంబంధించిన ఓ పత్రికా కథనం స్క్రీన్‌షాట్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అందులో ఇస్రో ప్రైవేటీకరణ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని, సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్‌కు ఉద్యోగ సంఘాలు ఓ లేఖ రాశాయని ఉంది. అంతేకాదు అందులో ప్రస్తుత ఉద్యోగుల భవిష్యత్తు, ఇకపై

మిగతా 2లో..

# అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ బాంబుల వర్షం

విమాన వాహక నౌక డెస్ట్రాయర్‌పై బాలిస్టిక్ క్షిపణులతో దాడి

2 లో..

# 'ఈక్వల్ ఏరియా మ్యాప్'కు కొంత వరకే మద్దతు

- జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ భూభాగాలను భారతదేశ అధికారిక పటం ప్రకారమే చూపించాలి
- తప్పుదారి పట్టించే విధంగా ఉంటే అంగీకరించం: భారత్

## తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు టెండర్లు

**టీజీ రెడ్కో కీలక చర్యలు**

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (ఊూ అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. 169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న ముగుస్తుందన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాలని చెప్పారు.

## వెయ్యిరోజుల పాలన ఫ్లాప్ షో..



ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చించారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉద్ధృతమైన పోరాటం చేయాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ సూచించారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోం దని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని ఆదేశించారు. సమావేశంలో తన గురించి ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్ , అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉభయసభల్లో ఎండగట్టాలి**

అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ఉభయసభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని స్పష్టం చేశారు.

సర్కారుపై సత్తా చూపాలి

సీఎంతో పాటు కాంగ్రెస్ విధానాలు, పనితీరును ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు. భూదందాలు, భూమాఫియా కొనసాగుతోందని, భూములను నిషేధిత జాబితాలో ఎందుకు చేర్చారు? ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్కారు వైఖరిని అసెంబ్లీ సమావేశాల్లో నిలదీయాలని, కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ తెలంగాణకు చేసింది, చేస్తోంది శూన్యమని విమర్శించారు. ఢిల్లీలో జెన్ జీ ఆందోళన ప్రభావం బీజేపీపై పడిందని, అధిగమించేందుకు నియోజకవర్గాల పునర్విభజన చేస్తారన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ పోరాడితే ప్రభుత్వం డిఫెన్స్‌లో పడేలా ఉండాలన్నారు. మండలిలో మెజార్టీ ఉందని, సర్కారుపై సత్తా చూపాలని, తిట్లనే నమ్ముకునే వారుండే సభకు వెళ్లనక్కర్లేదని చాలా మంది చెప్పారని కేసీఆర్? వెల్లడించారు.

**అవిశ్వాస తీర్మానానికి వెనకాడం**

ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్న హరీశ్‌రావు కాళేశ్వరంపై శాసనసభలో మాట్లాడాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కాళేశ్వరం, రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణ ఉంటుందని, త్వరలో లక్షలాది మందితో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణ చేస్తారని పేర్కొన్నారు. అన్ని విషయాల్లో విఫలమైనవారే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బూతులు తిడుతున్న సభకు కేసీఆర్ రానక్కర్లేదని తామంతా చెప్పామని, తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి వెనకాడమని హెచ్చరించారు. నెలపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను అడుగుతామని, కాంగ్రెస్ పార్టీ ద్రోహాలు, 22ఏ అంశంపై అసెంబ్లీలో నిలదీస్తామని పేర్కొన్నారు.

## నర్సు హత్య ఘటనపై మేజిస్టీరియల్ విచారణ

విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏవైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా, మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అనే అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఈ కేసులో నేరానికి పాల్పడిన వ్యక్తికి చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ జరగాలని సీఎం అదేశించారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

**హైదరాబాద్(జనంసాక్షి):**

కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారంటూ పలువురికి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఇన్‌ఛార్జ్ కంది శ్రీనివాస్‌తో పాటు సంజీవరెడ్డి, జూపల్లి మల్లారెడ్డి, గజ్వేల్ నర్సారెడ్డికి నోటీసులు పంపింది. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు. ఎంతటి వారైనా పార్టీ లైన్‌లోనే పనిచేయాలని.. హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. తాను పొరపాటు చేసినా ఏఐసీసీకి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం తన డిక్షనరీలోనే లేదని చెప్పారు.

**వాళ్లిద్దరితో ఎలాంటి విభేదాలు లేవు**

మాజీ మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత చిన్నారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని మల్లు రవి స్పష్టం చేశారు. తాను ఎవరిపైనా కక్షతో నివేదిక ఇవ్వలేదని చెప్పారు. వాళ్లూ తన మిత్రులేనన్నారు. మహిళా మంత్రిగా సీఎంకు కొండా సురేఖ వచ్చి రాఖీ కట్టారని.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ధర్మం ప్రకారం జరిగినవేనని వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండాలని పార్టీ ఆదేశించిందని మల్లు రవి చెప్పారు. పార్టీ శ్రేణులు తమ ఫిర్యాదులను గాంధీభవన్‌కి వచ్చి చెప్పుకోవచ్చన్నారు. నకిరేకల్ సభకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రావడం మంచి పరిణామమన్నారు.

## మత్తు రహిత దేశంగా మారుస్తాం

మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు. ”2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది” అని అమిత్ షా అన్నారు. 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్‌ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్‌షా చెప్పారు. ”మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్?ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది” అని అమిత్? షా స్పష్టం చేశారు.

మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్‌షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. “తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు ‘రెడ్ (మావోయిస్టు) కారిడార్’ నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం” అని అమిత్ షా స్పష్టం చేశారు.

**పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!**

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్?-మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

పథకం పనులను మంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు, జరుగుతున్న పనులపై అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిలుకూరు మండలంలోని సీతారాంపురం సమీపంలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను మంత్రి పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని ఆకుపాములలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న ఎన్‌ఏసీ భవనాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం కృష్ణానగర్‌లో రూ.28 కోట్లతో నిర్మిస్తున్న ఆర్9 ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని శాంతినగర్‌లో రూ.54 కోట్లతో నిర్మిస్తున్న రాజీవ్ శాంతి ఎత్తిపోతల పథకం పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మంత్రి వెంట కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నర్సింహ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆందోళన విరమించండి

సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. హెల్త్ కార్డులు జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాన్ని ఎవరూ అషామాషీగా తీసుకోవద్దని ఉన్నతాధికారులకు ఆయన చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలన్న స్పష్టమైన సంకల్పంతో ప్రజాప్రభుత్వం ఉందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పదేళ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని హెల్త్ కార్డు పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా, కమిటెడ్‌గా ఉందన్నారు. హెల్త్ కార్డు పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జేఏడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మహేష్ దత్ ఎక్కా, హెల్త్ అండ్ మెడికల్ ప్రిన్సిపల్ సెక్రెటరి క్రిస్టీనా, హోమ్ డిపార్ట్ మెంట్ సెక్రెటరీ మోగితా రాణా, ఈహెచ్ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కుప్పకూలిన వసతి గృహం

ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు ఎదురుగా ఉండే ఈ భవనంలో ఎక్కువగా విద్యార్థులే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన ఈ భవనాన్ని విద్యార్థుల పేయింగ్ గెస్ట్ వసతి గృహంగా ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో భవనం లోపల దాదాపు 50 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం కావడంతో చాలా మంది గదుల్లోనే ఉన్నట్లు సమాచారం. భవనం కూలిపోవడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## ‘ఈక్వల్ ఏరియా మ్యాప్’కు కొంత వరకే మద్దతు..

న్యూఢిల్లీ(జనంసాక్షి): వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త ‘ఈక్వల్ ఏరియా మ్యాప్’ను (నిజ వైశాల్య ప్రపంచ పటం) వినియోగంపై ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానానికి భారత్ మద్దతు తెలిపింది. అయితే ఈ మద్దతు ప్రపంచ పటంలో ఏ నిర్దిష్ట మార్పులకు గానీ.. జాతీయ సరిహద్దుల చిత్రణకు గానీ ఆమోదం తెలిపినట్లు కాదని స్పష్టం చేసింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మాట్లాడుతూ.. ‘ఐక్యరాజ్య సమితి చేసిన ఈ తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఓటు వేసినందుకు గల కారణాలను కూడా వివరించింది. ఈ మద్దతు అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద భూభాగాలు లేదా ప్రదేశాల పేర్లతో సహా రాజకీయ ఉద్దేశాలతో మార్పులు చేసిన పటాల గురించి ప్రస్తావించదు. అంతే కాకుండా ఈ పటంలో జమ్మూ కశ్మీర్, లద్ధాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలతో సహా సార్వభౌమ భూభాగాలను భారతదేశ అధికారిక పటం ప్రకారమే చూపించాలి. అందుకు విరుద్ధంగా తప్పుదారి పట్టించే విధంగా చూపించే ఏ చిత్రీకరణ అయినా ఆమోదయోగ్యం కాదు. సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై భారతదేశ వైఖరి స్పష్టంగా ఉంటుంది. ఈ విషయంలో రాజీ పడే అవకాశమే లేదు’ అని జయస్వాల్ స్పష్టం చేశారు.

కొత్త ప్రపంచ పటం..

వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త ‘ఈక్వల్ ఏరియా మ్యాప్’ను (నిజ వైశాల్య ప్రపంచ పటం) ఐక్యరాజ్య సమితి ఆమోదించింది. దీంతో 16వ శతాబ్దం నుంచి అమల్లో ఉన్న మర్కేట ప్రపంచ పటం కనుమరుగు కానుంది. కొత్త పటంలో భారత్, ఆఫ్రికాలు పెద్దగా కనిపిస్తాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. పటంలో మాత్రమే ఈ మార్పులు కనిపిస్తాయి. దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయనం కోసం రూపొందించిన పాత మర్కేట పటాన్ని ఐరాస కాలం చెల్లినదిగా ప్రకటించింది. దీంతో ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపెట్టింది.

## కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ మహాధర్నా

పోరాడి స్వరాష్ట్రం సాధించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ఉన్నత చదువులు చదివితే సరిపోదు.. సంస్కారం కూడా ఉండాలని కేటీఆర్ గ్రహించాలి. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. నగరానికి అనుబంధంగా ఫ్యూచర్‌సిటీ మరో గొప్ప నగరంగా ఎదుగుతోంది. సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల.. పదేళ్లపాటు నెరవేరలేదు. ప్రతి నియోజకవర్గానికీ 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం”అనిగౌడ్ అన్నారు.

బీఆర్ఎస్ వైఖరి మారకపోతే.. మరో పదేళ్లూ రోడ్లపైనే: మంత్రి శ్రీధర్ బాబు

భారత రాష్ట్ర సమితి నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదు.. అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సభకు వచ్చి.. వారి అనుభవాన్ని పంచుకోవాలన్నారు. ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో పాటు ముఖ్యనేతలు జగ్గారెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందన్నారు. “విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలి. ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వకుండానే దౌర్భాగ్య పాలన పదేళ్లపాటు సాగింది. బీఆర్ఎస్, భాజపా కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్నబియ్యం తీసుకోవట్లేదా? రెండున్నరేళ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ. 1.60 లక్షల కోట్లు జమచేశాం. మళ్లీ ఎన్నికలకు వెళ్లేలోపు.. ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తాం. రూ. 8 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. ఆ అప్పుపై అసలు, వడ్డీ చెల్లిస్తూ.. సంక్షేమం కూడా అమలు చేస్తున్నాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా గ్రేడ్ 1 నియామకాలు జరగలేదు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే.. మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారు” అని శ్రీధర్ బాబు అన్నారు.

## ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల పోరుబాట

సంస్థ పాత్ర, తదనంతర పరిణామాలు గురించి కూడా వారు ప్రశ్నించినట్లు పేర్కొంది. దీనిపై జైరాం రమేశ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ”అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామనే పేరుతో, మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇస్రో ప్రాధాన్యతను తగ్గిస్తోంది. అంతకంటే దారుణం ఏమిటంటే, దశాబ్దాలుగా ఎంతో కష్టపడి నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీనిని ఇస్రో ఉద్యోగులే స్వయంగా, ధైర్యంగా ప్రశ్నిస్తుండడం, ఎంతో ప్రశంసనీయం.”అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు.”ఇటీవల జీఎస్ఎల్‌వీ ప్రయోగం అద్భుత విజయం సాధించింది. ఇది ఇస్రో ఉద్యోగుల కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. కానీ భారత్‌లో, విదేశాల్లో ఉండి ఇస్రోను విమర్శించేవారికి, సందేహవాదులకు ఇది తీవ్ర నిరాశను కలిగించి ఉంటుంది. ఇస్రో మాజీ ఛైర్మన్ ఒకరు ఇప్పటికే దీనిపై తన ఆందోళనను ధైర్యంగా వ్యక్తం చేశారు. విక్రమ్ సారాభాయ్, సతీశ్ ధావన్ లాంటి మహానుభావులు నిర్మించిన ఈ అద్భుతమైన వ్యవస్థను ఒక పద్ధతి ప్రకారం అస్తవ్యస్తం చేస్తుంటే చూస్తూ ఊరుకోకుండా, మిగిలిన వారు కూడా ధైర్యంగా మాట్లాడాలి” అని జైరాం రమేశ్ అన్నారు. అంతరిక్ష కార్యక్రమాల విషయంలో మోదీ ప్రభుత్వం చాలా దూకుడుగా, ప్రైవేటీకరణ దిశగా వెళ్తూ, ఇస్రో గొంతును నొక్కుతోందని కాంగ్రెస్ ఇంతకు ముందు కూడా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే.

ఇస్రోను నిజంగా ప్రైవేటీకరిస్తారా?

ఇస్రో ప్రైవేటీకరణ వ్యవహారం ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. రాకెట్ల తయారీ, సాంకేతికత బదిలీ, ప్రయోగ వేదికల నిర్వహణలో ప్రైవేట్ సంస్థల జోక్యం విపరీతంగా పెరిగిపోతుండటంపై ఇస్రో ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనితో సంస్థ భవిష్యత్తుపై తక్షణమే స్పష్టతనివ్వాలని డిమాండ్ చేస్తూ, వేలమంది సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌కు లేఖరాశాయి. ఈ విధానపరమైన మార్పులతో భవిష్యత్‌లో నియామకాలు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లపై పడే ప్రభావంపై అధికారికంగా, లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాధనం, తరాల శ్రమతో నిర్మించిన లాంచ్ కాంప్లెక్స్‌లు, టెక్నాలజీని ఏ ప్రాతిపదికన ప్రైవేట్‌కు ఇస్తారని సూటిగా ప్రశ్నించాయి. ఈ వ్యవహారంలో ఎన్ఎస్ఐఎల్, ఇన్‌స్పేస్ పాత్రేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇస్రో ప్రయోగ వాహక నౌకలను తయారు చేయదని, ఆ బాధ్యతను పూర్తిగా ప్రైవేట్ లేదా ప్రభుత్వ సంస్థలకు అప్పగిస్తామని ఇటీవల ఇన్-స్పేస్ ఛైర్మన్ పవన్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి దారితీశాయి. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని వ్యతిరేకించడం లేదని, కానీ ఇస్రోను ఒక నామమాత్రపు పరిశోధనాభివృద్ధి కేంద్రంగా మార్చే విధానాలను అంగీకరించబోమని ఉద్యోగ సంఘాలు తేల్చిచెప్పాయి. ఎస్ఎస్ఎల్‌వీ సాంకేతికతను హెచ్ఏఎల్‌కు బదిలీ చేసినట్లే, భవిష్యత్తులో పీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3 రాకెట్లను ప్రైవేట్ పరం చేస్తారా అని నిలదీశాయి. వాస్తవానికి ఇస్రోను 1969లో స్థాపించగా, దాని మొదటి ఛైర్మన్‌గా విక్రమ్ సారాభాయ్ నియమితులు అయ్యారు. ఆయన ఇస్రో రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఈ ఇస్రో భారత అంతరిక్ష రంగంలో అద్భుతమైన విజయాలు సాధించింది. కాగా ఇప్పుడు దానిని ప్రైవేటీకరిస్తారనే వార్తలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

## విద్యాలయాల వేదికపైనా రాజకీయ ప్రచారాలేనా..?

మాట్లాడడానికి అది ఒక మంచి అవకాశం. కానీ మీరు యువత వేసే ప్రశ్నలను ఎదుర్కొనేందుకు బదులుగా, మీ ప్రసంగం కాస్త మరో రాజకీయ ప్రచారంగా మార్చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణచివేయడానికి, సొంత వైఫల్యాలను దాచడానికి మీరు ప్రతిపక్షాలకు కొత్త విశేషణాలను సృష్టిస్తున్నారు. నారాజ్? ఫూఫా (కోపదారి మేనమామ), దిమాగీ నక్సల్, అర్బన్ నక్సల్, ఖాన్ మార్కెట్ గ్యాంగ్, ఆందోళనజీవి, పరాన్నజీవి ఇలా చాలా విశేషణాలు మారుతూ ఉన్నప్పటికీ, మీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు మాత్రం మారడం లేదు.”అని అన్నారు

**యాంగ్రీ అంకుల్స్**

శనివారం ప్రధాని మోదీ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించేవారిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారిని ‘యాంగ్రీ అంకుల్స్’ అని అభివర్ణించారు. మోదీ ఎస్ఆర్‌సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, “ఈ క్యాంపస్ వెలుపల, మీకు ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. మీరు రెండు రకాల వ్యక్తులను కలుస్తారు. మొదటి రకం వారు సమాజం శక్తిని దేశ శక్తిగా మార్చే వ్యక్తులు. ఇక రెండో రకం వాళ్లు ఏ పని ప్రారంభమైనా యాంగ్రీ అంకుల్ లాగా మారిపోతారు. ప్రతి పనిని వ్యతిరేకించడమే వారి పని. వారికి ఒకే ఒక డైలాగు తెలుసు- ‘దీని అవసరం ఏముంది?’. మేము ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) నిర్మిస్తున్నప్పుడు, కొందరు ఫూఫాలు దీని అవసరం ఏముందని అన్నారు. మేము హైస్పీడ్ రైళ్లు, యూపీఐ ప్రారంభించినప్పుడు కూడా అలానే అన్నారు.

## అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ బాంబుల వర్షం

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్- అమెరికా మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణను తీవ్రం చేస్తూ.. ఐఆర్‌జీసీ దళాలు అగ్రరాజ్యానికి చెందిన విమాన వాహక నౌక, డెస్ట్రాయర్‌పై బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడ్డాయి. అమెరికా యుద్ధ నౌకలు హర్మూజ్‌లో ఇరాన్ ట్యాంకర్లను అడ్డుకుంటుండడంతో వాటిని లక్ష్యంగా చేసుకున్నట్లు టెహ్రాన్ ప్రకటించింది. దాడుల్లో అమెరికా నౌకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ఆ తర్వాత అవి హర్మూజ్‌ను విడిచి వెళ్లిపోయాయని తెలిపింది. శనివారం హర్మూజ్‌లోని ఇరాన్ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడుల అనంతరం ఐఆర్‌జీసీ ఈ దాడులకు పాల్ప డింది. హర్మూజ్‌లో అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న మూడు ట్యాంకర్లను.. అమెరికాకు అనుబంధంగా ఉన్న మరో మూడు నౌకలను కూడా లక్ష్యం చేసుకున్నట్లు తెలిపింది. ‘ఇరాన్ నౌకల విష´యంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తూ.. దాడులు కొనసాగిస్తే మా నుంచి గట్టి ప్రతిస్పందనను ఎదుర్కో వాల్సి ఉంటుంది. ఆ దేశ సైనిక నౌకలపై దాడులు మరింత తీవ్రతరం చేస్తాం. గతంలో కంటే ఇప్పుడు మేము మరింత బలంగా ఉన్నాము’ అని ఐఆర్‌జీసీ పేర్కొంది.

# కేటీఆర్‌కు దుబాయ్ గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆహ్వానం



హైదరాబాద్ (జనంసాక్షి) : దుబాయ్‌లో అక్టోబర్ 11న నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను గల్ఫ్ తెలంగాణ ఫోరం (జీటీఎఫ్) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గల్ఫ్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు ఆకుల సురేందర్ ప్రతినిధి బృందం కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, బతుకమ్మ వేడుకల ఆహ్వాన పత్రికను అందజేసింది. అనంతరం మహేష్ బిగాల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ప్రత్యేక ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ బిగాల మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను గల్ఫ్ దేశాల్లోని పలు తెలంగాణ సంఘాలు ఘనంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. అక్టోబర్ 11న దుబాయ్‌లో గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుంచి 7:30 గంటల వరకు, అనంతరం జుజూ ఆధ్వర్యంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు బతుకమ్మ వేడుకలు జరుగుతాయని వెల్లడించారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ కేటీఆర్ పాల్గొంటారని మహేష్ బిగాల తెలిపారు. ఈ కార్యక్రమంలో జయంత్ కుమార్, అభినవ్, ఆకుల కళ్యాణ్, లత, తదితరులు పాల్గొని కేటీఆర్‌ను కలిశారు.

# అన్ని రంగాలు, వ్యవస్థలు ఆగమవుతున్నయ్

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు వద్దిరాజు రవిచంద్ర



వైరా (జనంసాక్షి) : రాష్ట్రంలో అన్ని రంగాలు,వ్యవస్థలు ఆగమైపోతున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో ఆకుపచ్చగా, సస్యశ్యామలంగా వర్ధిల్లిన రాష్ట్రం ఇప్పుడు విధ్వంసం అవుతున్నదన్నారు.కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను దుయ్యబడుతూ పల్లెల విధ్వంసం, పడకేసిన పారిశుద్ధ్యంపై నిరసన వ్యక్తం చేస్తూ వైరా నియోజకవర్గం జూలూరుపాడులో ఆదివారం బీఆర్ఎస్ ఒక కార్యక్రమం ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, పార్టీ సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ,కూరాకుల నాగభూషణం తదితర ప్రముఖులు హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగుచేసి, కాళేశ్వరం బహుళ దశ ప్రాజెక్టుతో నిరంతరం ఉచిత విద్యుత్ సరఫరా, రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ఆకుపచ్చగా, సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఇప్పుడు తెలంగాణలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని ఎంపీ రవిచంద్ర ఆందోళన చెందారు. కేసీఆర్ హయాంలో గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు అందేవని,చెత్త సేకరణ, పారిశుద్ధ్యంపై కోసం ట్రాక్టర్లతో పాటు అవసరమైన పనిముట్లు, సిబ్బంది ఏర్పాటు చేశారని ఎంపీ రవిచంద్ర వివరించారు.అన్ని గ్రామాలు, పల్లెలు, గూడెంలలో సీసీ రోడ్లు,డ్రైనేజీ కాలువలు నిర్మించి,వైకుంఠధామాలు,పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడం జరిగిందని, మిషన్ భగీరథ ద్వారా తాగునీళ్లకు ఏ మాత్రం కొరత లేకుండా చూశారన్నారు. కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో ట్రాక్టర్లు మూలన పడ్డాయని, జీతాలు లేక సిబ్బంది ఇబ్బందు పడుతున్నారని,చెత్త సేకరణ నిలిచిపోయిందని, పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. పల్లెలు బాగుపడాలన్నా, హైదరాబాద్ మహానగరంతో పాటు పట్టణాలు అభివృద్ధి చెందాలన్నా బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

# దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో బీసీలకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా కులగణన చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోఠిలోని కందస్వామి లేన్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ సాధికారత సంస్థ (బీసీసీఈ) 12వ వార్షికోత్సవ కార్యక్రమానికి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీసీసీఈ ఆధ్వర్యంలో ప్రచురించిన 'మహనీయుల గాథల' హిందీ, ఇంగ్లీష్ అనువాద పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం బీసీసీఈ పుష్కరకాలంగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీసీసీఈ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు తూళ్ల దేవేందర్ గౌడ్ 26 పుస్తకాలను తెలుగులో ప్రచురించడంతో పాటు, సంస్థ ద్వారా సామాజిక అంశాలను దేశవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అడ్డంకిగా లేకపోతే, బీసీల రిజర్వేషన్ల విషయంలో 50 శాతం పరిమితి ఎందుకు అడ్డంకిగా మారాలని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు వారి హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. బీసీసీఈ సంస్థకు స్థలం కేటాయింపు అంశాన్ని దేవేందర్ గౌడ్ తన దృష్టికి తీసుకువచ్చారని, ప్రభుత్వం తరఫున సాధ్యమైనంత మేరకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి బీసీసీఈ చైర్మన్, దేవేందర్ గౌడ్ అధ్యక్షత వహించగా, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఢిల్లీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఇనుకొండ తిరుమలి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆదివాసీ ప్రొఫెషనల్ తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా భూక్యా శోభన్

మహబూబాబాద్ (జనంసాక్షి) : ఆల్ ఇండియా ఆదివాసీ ప్రొఫెషనల్ గ్రూప్ తెలంగాణ , మహారాష్ట్ర రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా భూక్య శోభన్‌బాబును జాతీయ అదివాసి అధ్యక్షుడు డా. విక్రాంత్ భూరియా నియమించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలానికి చెందిన భూక్య శోభన్ బాబు ప్రస్తుతం ఆయన ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర ఆదివాసీ ప్రొఫెషనల్ గ్రూప్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా వివిధ రంగాల్లో స్థిరపడిన ఆదివాసీ ప్రొఫెషనల్స్‌ను గుర్తించి, వారిని ఒక బలమైన నెట్‌వర్క్‌గా అనుసంధానం చేయడమనేని తన లక్ష్యమని శోభన్‌బాబు తెలిపారు. డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ఐటీ నిపుణులు, విద్యావేత్తలు ఒక వేదిక మీదికి తీసుకరావడమే తన లక్ష్యమన్నారు. పరిశోధకులు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రభుత్వ --ప్రైవేట్ రంగ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు, యువ ప్రొఫెషనల్స్‌ను ఒక వేదికపైకి తీసుకువచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మెంటార్‌షిప్, నాయకత్వ అభివృద్ధి సామాజిక సాధికారత దిశగా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనపై పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ డా. విక్రాంత్ భూరియా, ఏఐసీసీ నాయకులు కొప్పుల రాజుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# బీజేపీ, టీఆర్ఎస్ ఒకేతాను ముక్కలు

- అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ
- మక్తల్‌లో ఓట్ల తొలగింపుపై మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యలు




మక్తల్ (జనంసాక్షి) : పార్లమెంట్ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ, టీఆర్ఎస్ కలిసి పోవడం వల్లనే మెజార్టీ వచ్చిందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఏడు మండలాల బీఎల్ఏల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదే ఆలోచనలతో మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ, టీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, దాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవాలని ఆయన అన్నారు. ఇప్పటికే మక్తల్ నియోజకవర్గంలో 36 వేల ఓట్లు తొలగించబడ్డాయని, తాజాగా మరో 76 వేల ఓట్ల తొలగింపునకు నోటీసులు వచ్చాయని తెలిపారు. అర్హులైన ఓటర్లు హక్కు కోల్పోకుండా ప్రతి బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. దాదాపు రూ.2 వేల కోట్లతో మక్తల్ నియోజకవర్గం అభివృద్ధిలో ఇదే రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచిందని, దీనితోపాటు ప్రతి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ప్రతి గ్రామానికి రోడ్లు, పాఠశాల భవనాలకు నిధులు కేటాయించామని, గతంలో ప్రభుత్వం వీటి గురించి ఒక్కసారి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. అభివృద్ధి విషయంలో ప్రతి పథకం గురించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సామాన్య జనానికి వివరించాలని, అందుకు అన్ని రకాలుగా అండదండలు ఉంటాయని ఆయన అన్నారు. సర్‌పై పార్టీ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని, వాటిని ప్రతి కార్యకర్త వందకు వంద శాతం ఖచ్చితంగా పాటించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. పార్టీ ఉంటేనే మనం ఉన్నామని, మక్తల్‌లో పార్టీని కష్టకాలంలో కాపాడింది నియోజకవర్గ కార్యకర్తలేనని స్పష్టం చేశారు. అర్హులైన ప్రజల ఓట్లు తొలగిపోకుండా చూడటమే ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఓటు హక్కును కాపాడేందుకు పనిచేసే వ్యక్తే నిజమైన కార్యకర్త అని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు మక్తల్ నియోజకవర్గ అబ్జర్వర్ గుత్తా అమిత్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవతి గౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

- యూత్ అండ్ జూనియర్ మల్టీక్లాస్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ 2026లో పతకాలు
- పోటీల్లో పాల్గొన్న ముగ్గురు విద్యార్థులకు మూడు పతకాలు
- స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు కైవసం
- విద్యార్థులను అభినందించిన సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి సైదులు




హైదరాబాద్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఈఐఎస్) విద్యార్థులు జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీల్లో ప్రతిభ చాటారు. యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (వైసీహెచ్)లో శిక్షణ పొందుతున్న బీసీ గురుకుల విద్యార్థులు కర్ణాటకలోని మైసూరులో ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన యూత్ అండ్ జూనియర్ మల్టీక్లాస్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ - 2026 పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్య పతకంతో మొత్తం మూడు పతకాలను సాధించారని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. 420 మిక్స్‌డ్ క్లాస్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి కామారెడ్డి జిల్లా బీసీ గురుకులంలో చదువుతున్న సుంచనకోట రిష్విత స్వర్ణ పతకం, హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట బీసీ గురుకులంలో చదువుతున్న జల్లమ్మగారి శిరీష రజత పతకం సాధించారని ఆయన పేర్కొన్నారు. బాయ్స్ విభాగంలో హైదరాబాద్‌లోని షామీర్‌పేట్ బీసీ గురుకులంలో చదువుతున్న ధనుష్ జక్కుల అద్భుతంగా రాణించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కార్యదర్శి తెలిపారు. ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో నల్గొండ జిల్లా మునుగోడు బీసీ గురుకులంలో చదువుతున్న హనుమంతు పోటీపడి 24 మంది సెయిలర్లలో 14వ స్థానంలో నిలిచాడన్నారు. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలను కల్పించేందుకు సొసైటీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. విద్యార్థులకు యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ద్వారా నిపుణుల ఆధ్వర్యంలో సెయిలింగ్‌లో ప్రొఫెషనల్ శిక్షణ అందించడంతో పాటు, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన పోటీ అనుభవాన్ని కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా గురుకుల విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సంబంధిత గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, క్రీడా సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, కమిషనర్ బాల మాయాదేవి, బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపసర్పంచుల సంఘం ఉపాధ్యక్షురాలిగా పీ. వరలక్ష్మి



కొమురంభీం అసిఫాబాద్ (జనంసాక్షి) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ఉప సర్పంచ్ పీ. వరలక్ష్మిని తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపసర్పంచుల సంఘం ఉపాధ్యక్షురాలిగా నియమించారు. తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోట్ల కార్తిక్ ఆదివారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ, మహిళా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉపసర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, ఉపసర్పంచులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. పీ. వరలక్ష్మి నియామకం పట్ల రెబ్బెన మండల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# వనప్రవేశ కార్యక్రమంలో అమ్రాబాద్ ప్రజలు



అమ్రాబాద్ (జనంసాక్షి) : నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండల కేంద్ర ప్రజలు మన్ననూరు గ్రామ ప్రజలు ఆదివారం నిర్వహించిన వన ప్రవేశ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కలిసి అమ్రాబాద్ గ్రామ ప్రజలు లోకేశ్వరం చెరువు ప్రాంతానికి వెళితే మన్ననూరు గ్రామ ప్రజలు పురుగుల గుట్ట, దుర్వాసుల చెరువు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. వన ప్రాంతానికి వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు, అడవితో తమకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పెరముల కొండయ్య, బుచ్చయ్య, సంబు వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ అడవులు కేవలం పచ్చదనానికే కాకుండా, పర్యావరణ సమతుల్యతకు, వన్యప్రాణుల సంరక్షణకు ఎంతో కీలకమని అన్నారు. మన్ననూరు గ్రామం అడవులకు సమీపంలో ఉండటంతో ప్రజలకు అడవితో ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. వన ప్రవేశం సందర్భంగా గ్రామ ప్రజలు ప్రకృతి అందాలను వీక్షిస్తూ, అడవుల ప్రాధాన్యత పై చర్చించుకున్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. వన ప్రవేశ కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపడంతో పాటు.. అడవుల పరిరక్షణ పై మరింత అవగాహన కల్పించిందని తెలిపారు.

# 50 లక్షలు ఇవ్వాలని నన్ను గన్‌తో బెదిరిస్తున్నారు

### కాంగ్రెస్ నేతలపై యువనేత ఫిర్యాదు..!


హైదరాబాద్ (జనంసాక్షి) : కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నేతలపై యువ నేత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేపీహెచ్‌బీ కాలనీలో నివసించే కాంగ్రెస్ పార్టీ పీసీసీ కార్యదర్శి (మాజీ) గాలి బాలాజీ, బాలాజీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్, కాంగ్రెస్ నాయకులు నాగమల్లేశ్వర్‌రావులు లైసెన్స్‌డ్ గన్‌తో తనను బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేస్తున్నారని అతడు పోలీసులను ఆశ్రయించాడు. కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో నివాసం ఉండే ముత్తిరెడ్డి ఫణీంద్ర అలియాస్ పీఆర్‌నాయుడు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు ఫణీంద్ర. కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ పీసీసీ కార్యదర్శి (మాజీ) గాలి బాలాజీ, బాలాజీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్, కాంగ్రెస్ నాయకులు నాగమల్లేశ్వర్‌రావు, దుర్గాప్రసాద్, రాము, ఖధీర్.. తనను బెదిరిస్తున్నారని ఆదివారం పోలీసులకు ఫణీంద్ర ఫిర్యాదు చేశాడు. రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ మద్దతు) ఉందని, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో పరిచయం ఉందని గాలి బాలాజీ స్థానికంగా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్నాని అతడు తెలిపాడు. కూకట్‌పల్లిలో సర్వే నెంబర్ 141లో భూమిని బాలజీ కబ్జా చేశారని, బిల్డర్ల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేశారని ఫణీంద్ర తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాలాజీ బృందం చేస్తున్న చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు సహకరించడం లేదని తనపై అక్రమంగా కేసులు పెడుతూ.. బెదిరిపంపులకు పాల్పడుతున్నారని ఫణీంద్ర పోలీసులకు చెప్పాడు.

సెప్టెంబర్ 2వ తేదీన ఓ హోటల్‌లో గాలి బాలాజీకి చెందిన లైసెన్స్‌డ్ గన్‌తో నాగమల్లేశ్వర్‌రావు, రాజేష్‌లు బెదిరింపులకు పాల్పడ్డరని, రూ. 50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని అతడు తెలిపాడు. బాలాజీ టీమ్ సభ్యులంతా పలుమార్లు సెల్‌ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ జరిపి తనకు రక్షణ కల్పించాలని పోలీసులను ఫణీంద్ర కోరాడు. పైన పేర్కొన్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌కు, పోలీస్ ఉన్నతాధికారులకు పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్టు భాధితుడు ఫణీంద్ర తెలిపాడు. అయితే.. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని కేపీహెచ్‌బీ కాలనీ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

# 'ట్రెసా' అధ్యక్షుడిగా గౌతమ్ కుమార్, జనరల్ సెక్రటరీగా రమణ్ రెడ్డి








హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా కె.గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎల్.రమణ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెవెన్యూ భవన్‌లో ట్రెసా మాజీ అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సీసీఎల్ఏ యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే, గతంలో అధ్యక్షుడిగా ఉన్న వంగ రవీందర్ రెడ్డి ఆగస్టు 31న పదవీ విరమణ పొందిన నేపథ్యంలో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటివరకు గత ఏడేళ్లుగా ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన కె.గౌతమ్ కుమార్‌ను అధ్యక్షుడిగా, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఎల్.రమణ్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, వంగ రవీందర్ రెడ్డిని ట్రెసా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

### ఉద్యోగుల సంక్షేమం, ప్రజాసేవకే తొలి ప్రాధాన్యం..

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పూర్వ అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డికి, రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ అసోసియేషన్ కీర్తిప్రతిష్టలను మరింత పెంచుతామని, ఉద్యోగుల సంక్షేమం, శాఖ ఉన్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు వేగంగా చేరవేస్తూ, సకాలంలో రెవెన్యూ సేవలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ట్రెసా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన గుర్తింపు పొందిన సంఘమని, ఉద్యోగుల జేఏసీలో కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### ఆనందోత్సాహాల మధ్య సంబరాలు..

ఇక నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన రెవెన్యూ ఉద్యోగులు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. కొత్తగా ఎన్నికైన నాయకులను గజమాలలతో సన్మానించి, డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.రాజ్ కుమార్, ఎండీ రియాజుద్దీన్, కోశాధికారి బి.వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు నిరంజన్ రావు, సీఎల్వీ శాస్త్రి, మనోహర్ చక్రవర్తి, రాష్ట్ర సమన్వయకర్త ఎం.నారాయణ రెడ్డి, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ జి.దేశ్యా నాయక్, కార్యదర్శులు జగన్ మోహన్ రెడ్డి, కృష్ణ చైతన్య, చంద్ర శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బొమ్మ రాములు, వెంకటేశ్వర్లు, నజీమ్ ఖాన్, సంయుక్త కార్యదర్శులు కిషన్ నాయక్, బి.కృష్ణయ్య, బి.జయరాం, విక్రమ్, సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షుడు మూర్తుజా, మాజీ నాయకులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు మన్నె ప్రభాకర్, ఎల్లారెడ్డి, అంజిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# ఇస్రో ప్రైవేటీకరణ

## పలు ప్రశ్నలు.. అనుమానాలు!

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కేవలం ఒక ప్రభుత్వ సంస్థ కాదు, అది కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక. చంద్రయాన్, మంగళయాన్, గగన్‌యాన్ వంటి ప్రాజెక్టుల ద్వారా ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయేలా చేసిన ఈ సంస్థ, దశాబ్దాల అహర్నిశల శ్రమ ద్వారా నిర్మించుకున్న సాంకేతిక సామర్థ్యాన్ని ఈనాడు అనుమానాస్పద పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నారు. ఎస్ఎస్ఎల్‌వీ సాంకేతికతను, ఉత్పత్తి హక్కులను హెచ్ఏఎల్‌కు బదిలీ చేయడం మొదలుకొని, పీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3 విషయంలోనూ అదే బాటలో అడుగులు వేయడం చూస్తుంటే, ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే అర్థమవుతోంది. ఇస్రోను క్రమంగా కేవలం పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా కుదించి, వాస్తవ తయారీ, ప్రయోగ బాధ్యతలను ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించే ప్రయత్నం ఇది.


ఇక్కడ అర్థం చేసుకోవలసిన మౌలిక విషయం ఒకటుంది – ఇస్రో సాధించిన విజయాలు ఏవీ ఒక్కరోజులో పుట్టుకొచ్చినవి కావు. వేలాది మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు తమ జీవితాంతం శ్రమించి నిర్మించిన మేధో సంపద ఇది. తక్కువ ఖర్చుతో అత్యధిక ఫలితాలు సాధించే నమూనాగా ఇస్రో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇలాంటి సంస్థ యొక్క గుండె వంటి తయారీ, ప్రయోగ కార్యకలాపాలను, ఎలాంటి పోటీ వాతావరణం లేని చోట, తగినంత అనుభవం లేని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం అంటే, జాతీయ గర్వకారణమైన ఈ వారసత్వాన్ని తాకట్టు పెట్టడమే. పోటీ ఉన్నప్పుడు ప్రైవేటీకరణ ఫలితాలు ఇవ్వొచ్చు, కానీ ఇక్కడ ఏకపక్షంగా ఎంపిక చేసిన సంస్థలకు కీలక సాంకేతికతను దారాదత్తం చేయడం వెనుక ప్రజా ప్రయోజనం కంటే మరేదో ఉందా అన్న అనుమానం సహజంగానే కలుగుతుంది.

ఈ నేపథ్యంలో ఇస్రో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన ఆందోళనలు అత్యంత సహేతుకమైనవి. తొమ్మిది ప్రధాన సంఘాలు కలిసికట్టుగా, తొలిసారిగా గళం విప్పి ఛైర్మన్‌కు లేఖ రాయడం అంటే పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తుంది. లాంచ్ వెహికల్ డిజైన్, తయారీ, సమీకరణ, పరీక్షలు, ప్రయోగ నిర్వహణ వంటివి కేవలం "తయారీ కాంట్రాక్టులు" కావు – ఇవి సంస్థ మౌలిక సామర్థ్యం, సంస్థాగత జ్ఞాపకశక్తి. వీటిని వేరు చేసి బయటకు ఇచ్చేస్తే, భవిష్యత్తులో ఇస్రో వద్ద మిగిలేది ఖాళీ బోర్డు మాత్రమే. యువ శాస్త్రవేత్తలకు నియామక అవకాశాలు తగ్గిపోతాయి, ప్రస్తుత ఉద్యోగుల సర్వీసు నిబంధనలు, పదోన్నతులు గందరగోళంలో పడతాయి. ఇంత పెద్ద మార్పు తీసుకొస్తూ, దానిపై స్పష్టమైన లిఖితపూర్వక విధాన పత్రం ఇవ్వకుండా, ఇన్–స్పేస్ ఛైర్మన్ నోటి మాటల ద్వారానే విషయాలు తెలియజేయడం ప్రజాస్వామిక పాలనకు తగదు.

ఇస్రో ఉద్యోగులు అడుగుతున్నది ఏమీ అసాధారణమైనది కాదు – తమ సంస్థ భవితవ్యంపై స్పష్టత మాత్రమే. దేశ భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలతో ముడిపడిన అంతరిక్ష రంగంలో ఇంతటి కీలక నిర్ణయాలు తీసుకునేముందు, పార్లమెంటు ముందు చర్చ జరగాలి, ఉద్యోగుల భాగస్వామ్యంతో విధానం రూపొందాలి, పారదర్శకత పాటించాలి. తొందరపాటుతో నిర్ణయాలు తీసుకొని, రేపు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిదో తెలియని పరిస్థితి తలెత్తకూడదు. ఇస్రో అంటే కేవలం ఒక ప్రభుత్వ శాఖ కాదు, అది జాతి గర్వం. దాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే, మరియు ఆ కాపలా కాస్తున్న ఉద్యోగుల గొంతును ఈరోజు వినకపోతే, రేపు మూల్యం చెల్లించుకోవలసింది యావత్ దేశమే.

## సభా గౌరవమే సర్వోన్నతం..

# ప్రజా సమస్యలే ఎజెండా..!



తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న వేళ రాష్ట్ర ప్రజలు సభ వైపు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రజలు తమ ఓటుతో ఎన్నుకున్న ప్రతినిధులు ఒకే వేదికపై కూర్చొని రాష్ట్ర భవిష్యత్తుపై చర్చించే అరుదైన ప్రజాస్వామ్య సందర్భం ఇది. అందుకే ఈ సమావేశాలు రాజకీయ ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు, నినాదాలతో కాకుండా ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చకు వేదిక కావాలి. గత శాసనసభ సమావేశాలను పరిశీలిస్తే అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు వ్యక్తిగత విమర్శలు, సభా కార్యకలాపాలకు అంతరాయం, తీవ్ర పదజాలం కారణంగా అసలు సమస్యలు పక్కకు వెళ్లిన పరిస్థితులూ కనిపించాయి. గత అనుభవాలు పాఠాలుగా ఉండాలి.. సంప్రదాయాలుగా మారకూడదు. ఈసారి ఆ పరిస్థితులకు తావులేకుండా అన్ని పార్టీలు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సభా వేదికగా ప్రజలకు వివరించాల్సిన బాధ్యతను స్వీకరించాలి. అదే సమయంలో గత పాలన నుంచి వారసత్వంగా వచ్చిన ఆర్థిక, పరిపాలనా సవాళ్లను ఎలా అధిగమిస్తున్నదో గణాంకాలు, వాస్తవాలతో వివరించాలి. ప్రభుత్వానికి తన నిర్ణయాలను సమర్థించుకునే అవకాశం సభ ఇవ్వాలి. సభలో ప్రవేశపెట్టే బిల్లులు కూడా సమగ్ర చర్చకు లోనుకావాలి. కోర్ అర్బన్ రీజియన్ వంటి ప్రతిపాదనలు, ఇతర చట్టపరమైన అంశాలపై అధికార, విపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేయాలి. ప్రభుత్వం కూడా ప్రతిపక్ష సూచనల్లో ప్రజా ప్రయోజనం కనిపిస్తే వాటిని స్వీకరించే ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శించాలి.

తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న వేళ ప్రజల దృష్టి ఇప్పుడు సభ వైపే ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కేవలం రాజకీయ పార్టీల వాదోపవాదాలకు వేదిక కాదు. ప్రజల సమస్యలను చర్చించి, ప్రభుత్వ విధానాలను సమీక్షించి, రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే అత్యున్నత ప్రజావేదిక. అందుకే ఈ సమావేశాలు అర్థవంతంగా, నిర్మాణాత్మకంగా సాగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా 22ఏ, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, సాగునీరు, యూరియా, ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలు చర్చకు వస్తే వాటిపై రాజకీయ దూషణలకు బదులు పరిష్కార మార్గాలను సూచించాలి. ప్రజలు కోరుకునేది ఎవరు ఎవరిని ఓడించారన్నది కాదు.. తమ సమస్యకు పరిష్కారం దొరికిందా లేదా అన్నదే. ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యం కల్పించింది. ఆ హక్కును బలంగా వినియోగించాలి. ప్రభుత్వ నిర్ణయాల్లో లోపాలు ఉంటే ఆధారాలతో నిలదీయాలి. అయితే ప్రశ్నకు పదునుండాలి కానీ పదజాలంలో పరుషత్వం ఉండకూడదు. విమర్శ విధానాలపై ఉండాలి.. వ్యక్తులపై కాదు. అదేవిధంగా అధికార పక్షం కూడా ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి అంశాన్ని రాజకీయ కుట్రగా చూడకుండా సమాధానం ఇవ్వాలి. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే విమర్శలకు సమాధానం సభా గణాంకాలతో, వాస్తవాలతో, ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలతో ఇవ్వగలగాలి. ఎదురుదాడి కంటే పనితీరు బలమైన సమాధానం.కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనను గత ప్రభుత్వంతో పోల్చి వివరణ ఇవ్వడం సహజమే. గతంలో జరిగిన తప్పిదాలను గుర్తుచేయడం ద్వారా ప్రస్తుత నిర్ణయాల అవసరాన్ని వివరించవచ్చు. కానీ గతాన్ని పదేపదే రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కంటే, గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తును నిర్మించడం మరింత ప్రయోజనకరం.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితి, ఉద్యోగాలు, రైతులు, విద్య, వైద్యం, సాగునీరు వంటి అంశాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అదే సమయంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వాస్తవాల ఆధారంగా సమీక్షించడం, లోపాలుంటే నిర్మాణాత్మకంగా ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యత. ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు. సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత. అయితే ప్రశ్నకు బదులు వ్యక్తిగత దూషణ, విధాన విమర్శకు బదులు బూతులు, ప్రజా సమస్యలకు బదులు రాజకీయ పరస్పర దాడులు చోటుచేసుకుంటే అసలు లక్ష్యం దెబ్బతింటుంది. సభలో వినిపించే ప్రతి మాటను ప్రజలు మాత్రమే కాదు, భవిష్యత్ తరాలు కూడా గమనిస్తాయి. అందుకే సభ్యులందరూ తమ మాటల విషయంలో సంయమనం పాటించాలి.అధికార పక్షం కూడా ప్రతిపక్ష ప్రశ్నలను కేవలం రాజకీయ విమర్శలుగా చూడకూడదు. సరైన ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు ఇవ్వాలి. ప్రజలకు సంబంధించిన అంశాలపై అవసరమైన సమాచారాన్ని సభ ముందు ఉంచాలి. ప్రభుత్వ పనితీరుపై విశ్వాసం ఉంటే విమర్శలకు సమాధానం పనితీరుతోనే ఇవ్వాలి. ప్రతిపక్షాలు కూడా గత పాలనలో జరిగిన పరిణామాలను పూర్తిగా విస్మరించాల్సిన అవసరం లేదు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, ఎదురైన ఆర్థిక సవాళ్లు, పరిపాలనా లోపాలు వంటి అంశాలను ప్రజల ముందుంచడం సహజమే. కానీ అవి వ్యక్తిగత కక్షలకు దారితీయకుండా విధానపరమైన చర్చగా ఉండాలి. గతాన్ని అద్దంగా ఉపయోగించాలి.. ఆయుధంగా కాదు.

గతంలో శాసనసభ సమావేశాల్లో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన కలిగించాయి. వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలు, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చర్చను పక్కదారి పట్టించిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడం ఇప్పుడు అత్యవసరం. గతాన్ని గుర్తుంచుకోవాలి.. కానీ గతపు చేదు సంప్రదాయాలను పునరావృతం చేయకూడదు.శాసనసభ సమయం ఎంతో విలువైనది. ప్రతి నిమిషం ప్రజల సమస్యల కోసం వినియోగించాల్సిన బాధ్యత సభ్యులందరిదీ. నినాదాలు, నిరసనలు ప్రజాస్వామ్యంలో భాగమే అయినప్పటికీ, అవి చర్చను పూర్తిగా భర్తీ చేయకూడదు. బూతులకు, వ్యక్తిగత దూషణలకు, అనుచిత వ్యాఖ్యలకు సభలో స్థానం ఉండకూడదు.ఈ సమావేశాల్లో అధికార పక్షం పాలనను వివరించే బాధ్యతతో, ప్రతిపక్షం ప్రజల తరఫున ప్రశ్నించే బాధ్యతతో వ్యవహరిస్తే ప్రజాస్వామ్యానికి మరింత గౌరవం లభిస్తుంది. ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకునే సిద్ధత చూపాలి; ప్రతిపక్షం సూచనలు చేసే నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. చివరికి శాసనసభలో గెలవాల్సింది అధికార పార్టీ కాదు.. ప్రతిపక్షం కాదు.. తెలంగాణ ప్రజల ప్రయోజనమే. గత సమావేశాల్లో చోటుచేసుకున్న చేదు అనుభవాలను పక్కనపెట్టి, సభా సంప్రదాయాలను కాపాడుతూ, వాదనకు విలువనిస్తూ, ప్రజా సమస్యలకు పరిష్కారాలు వెతుకుతూ ఈ వర్షాకాల సమావేశాలు ఆదర్శవంతంగా సాగాలి.రేవంత్ 1000రోజుల పాలనపై నిరసనలకు దిగి ప్రభుత్వం నుండి ఎదురుదాడి ఎదుర్కొన్నది. సభలో స్వరం ఎంత బలంగా వినిపించిందన్నది కాదు.. ప్రజల కోసం ఏమి ప్రశ్నించమని, ఎంత బలమైన నిర్ణయం తీసుకున్నామన్నదే చరిత్రలో నిలిచిపోతుంది.



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్,
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్-9866255355

# సౌర వృత్త తారావళి

"ఆరోగ్యం భాస్కరాదిచ్చేత్" అని ఆర్యోక్తి". రామ రావణ యుద్ధంలో అలసిన శ్రీరామునికి ఆదిత్య హృదయాన్ని ప్రబోధించి అగస్త్య మహర్షి అతనిలో నూతన జవసత్వాలు, పునరుత్తేజం కలిగేటట్లు చేశాడని చెప్పుకుంటాం. అలాగే రోజు ఉదయం సూర్య నమస్కారా లు చేయడం, మయూరుని సూర్య శతకాన్ని ఆరోగ్య ప్రాప్తి కోసం పారాయణం చేయడం ఇవన్నీ మన సంప్రదాయంలో ఉన్నవే. కాగా ప్రాచీనాంధ్ర సంస్కృతి సంప్రదాయాలను ఆపోసనం పట్టిన ప్రౌఢకవులు, విశ్వవిఖ్యాత శాస్త్రవేత్తలు ఆచార్య అప్పా జోస్యుల సత్యనారాయణ గారు తాజాగా రచించిన విశేష పద్య కృతి "సౌర వృత్త తారావళి". దివాకర వృత్త తారావళిని రచించిన వారే సూర్య గోళంలో నిత్యం జరిగే పరిణామాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తూ వారు ఈ పద్య కృతిని వెలువరించారు. తారలు అనగా నక్షత్రాలు 27 కనుక ఇందులో 20 మత్తేభ పద్యాలు 6 శార్దూల పద్యాలు ఒక ఉత్పలమాల పద్యాన్ని రాశారు.






అప్పా జోస్యుల వారు అజో- విభో కందాళం ఫౌండేషన్ ను స్థాపించి"ప్రతిభా పాండిత్యాలలో మేరు శిఖరాల వంటి మేధావులను సత్కరించడం, మన రంగస్థలం కళలను కళాకారులను ప్రోత్సహించడం, గౌరవించడం పది కాలాలపాటు పది లపరుచుకోవలసిన సాహిత్యాన్ని ప్రచురించడం, తెలుగు రచయితలకు చేయూతనివ్వడం"లక్ష్యంగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే వారు తిరుమల రామచంద్ర గారి హంపి నుంచి హరప్పా దాకా, బేతవోలు వారి వ్యాస గౌతమి, శ్రీ రామవరపు శరత్ బాబు గారి రామాయణ కల్పవృక్ష కావ్య సౌరభం, అక్కిరాజు రమాపతి రావు గారి సాహితీ వైజయంతి, అనుమాండ్ల భూమయ్య గారి పద్య కావ్యాలు మొదలైన 40కి పైగా రచనలను వెలువరించారు. ఇందులో వివిధ ప్రక్రియలు ఉన్నాయి. ప్రతి ఏటా సంస్థ పక్షాన "ప్రతిభా మూర్తి" పురస్కారాన్ని అందజేస్తున్నారు. "సారస్వత భాస్కర"బిరుదాంకితులైన అప్పా జోస్యుల వారు వృత్తిరీత్యా శాస్త్రవేత్తలు ప్రవృత్తి రీత్యా ప్రౌఢ పద్య విద్యాధరులు. శాస్త్రము, సాహిత్యము రెండింటి యందు సవ్యసాచి. కనుకనే వారి కలం నుండి "సౌర వృత్త తారావళి" వెలువడడం హర్షనీయం. అభినందనీయం. ఈ రచనలో ఆయన సూర్య గోళం లో జరిగే పరిణామాలతో పాటు, ఇతర గ్రహాలలో జరిగే నిత్యం జరిగే మార్పులె న్నింటినో శాస్త్రీయంగా విశ్లేషించారు. కోట్లాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యునిలో నిరంతర విస్ఫోటనాలు, జ్వాలలు చెలరేగుతాయని"భువికిన్.. సం విజ్ఞాన మార్గమ్ములన్". అనే పద్యంలో పేర్కొన్నారు. పదో పద్యంలో సూర్యకాంతి భూమిని చేరడానికి"పంచశ తీ నిమేషములు" అనగా 8 నిమిషాల 20 సెకండ్ల కాలం పడుతుందని తెలియపరుస్తూనే అది లక్ష ఏళ్లకు ముందే సూర్యగర్భంలో పుట్టిందన్నారు. కవి ఆ కాలాన్ని శత సహస్రాబ్దములుగా అభివర్ణించారు. అలాగే"మన సౌరస్థము... పొందుట న్"అనే పద్యంలో సౌరస్థ ద్రవ్యరాశిలో 14 పాళ్ళు గ్రహరాశికి చెందితే మిగతా 986 పాళ్లు సూర్య ప్రతాపాని దేనని వివరించారు. సూర్య గ్రహం తర్వాత బుధ, శుక్ర, భూ, అంగారక, గురు, శని, వరుణ, ఇంద్రగ్రహాల స్థితిని ప్రస్తావించారు. బుధ గ్రహం"మహోష్ణంబునన్ సములేలేని మహోగ్ర గ్రోళము చౌరన్ శక్యంబె భూవాసికిన్" అని దాని తీవ్రతను, వ్యక్తీకరించారు. ఎనిమిదవ గ్రహమైన ఇంద్రగ్రహముపై "వజ్రవృష్టి" కురుస్తుందని చెప్పారు. ఇలా గతంలో ఏడు తారావళి పద్య రచనలను వెలువరించిన అప్పా జోస్యుల వారు "సూర్యుని అంత: చేతనము, సూర్య మండల స్వరూప స్వభావాలు సారాంశ ప్రతిపాదకంగా పద్యరూపంలో చెప్పాలని ఆశంసతో సౌరవృత్త తా రావళిని వెలువరించినట్లు" కృతజ్ఞతలు లో చెప్పుకున్నారు. ప్రముఖ రచయితలు విహారి గారు పద్య కిరణ ప్రసారామృతము" అను పేరుతో ఆచార్య పతంజలి గారు "ఆధ్యాత్మిక శాస్త్రీయ విజ్ఞాన సమన్వయ ధృవతార"మను పేరుతో ఈ కృతిలోని సారస్యాన్ని పాఠకులకు వివరిస్తూ విలువైన ముందు మాటలను అందించారు. పద్యాలయం నిర్వాహకులు, తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు ఈ కావ్య నేపథ్యాన్ని గురించి, సంబంధితంగా వచ్చిన స్పందనలను తెలియజేశారు." ఆంధ్రావళి మోదం బరయునట్లుగా" వెలువడిన "సౌర వృత్త తారావళి" ఇటు శాస్త్ర సాంకేతిక అభిమానులకు, అటు సాహిత్య ప్రియులకు చక్కని ఉపాదేయమవుతుందని విశ్వసిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# అక్షరాస్యతలో వెనుకబాటు : సమస్య ఎక్కడ?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు దేశంలోని ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలుగా తమను తాము చెప్పుకుంటున్నప్పటికీ అక్షరాస్యత విషయంలో మాత్రం ఇంకా వెనుక వరుసలోనే ఉండటం ఒక తీవ్రమైన విధాన వైఫల్యానికి సంకేతం. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో ఐటీ, పరిశ్రమలు, ఉన్నత విద్యా సంస్థలు వేగంగా విస్తరిస్తున్నాయన్నది ఒక వాస్తవం. కానీ ఆ నగరాల వెలుపల ఉన్న గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలు, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా పరిస్థితిని పరిశీలిస్తే అభివృద్ధి ఎంత అసమానంగా ఉందో అర్థమవుతుంది.



జాతీయ గణాంకాలు ఈ వైరుధ్యాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. 2023-24 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం ఏడు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో దేశ అక్షరాస్యత 80.9 శాతం. అదే సమయంలో తెలంగాణలో 76.9 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 72.6 శాతం మాత్రమే ఉంది. అంటే తెలంగాణ జాతీయ సగటు కంటే నాలుగు శాతం పాయింట్లు, ఆంధ్రప్రదేశ్ 8.3 శాతం పాయింట్లు వెనుకబడి ఉన్నాయి. పెద్ద రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అత్యల్ప అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా, తెలంగాణ కూడా దిగువ స్థాయిలోనే ఉంది.

ఇది కొత్తగా పుట్టిన సమస్య కాదు. 2011 జనగణనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత 67.66 శాతం మాత్రమే. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ 66.54 శాతం, ఆంధ్రప్రదేశ్ 67.35 శాతం వద్ద ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చూపిస్తున్నాయి. అంటే గత దశాబ్దంలో పురోగతి జరిగినప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వేగం సరిపోలేదనే ప్రశ్న తప్పదు.

అయితే కేవలం అక్షరాస్యత శాతాన్ని చూసి ప్రభుత్వాల పనితీరును కొలవడం కూడా సరైన పద్ధతి కాదు. అక్షరాస్యత అంటే పేరు రాయడం, సాధారణంగా చదవడం మాత్రమే కాదు. ఒక పిల్లవాడు పాఠశాలకు వెళ్లి ఐదో తరగతి పూర్తి చేసినా సరళమైన వాక్యాన్ని అర్థం చేసుకోలేకపోతే, ప్రాథమిక గణితాన్ని చేయలేకపోతే, డిజిటల్ సమాచారాన్ని ఉపయోగించలేకపోతే ఆ విద్య యొక్క ప్రయోజనం ఎంత? కాబట్టి ఇకపై ప్రభుత్వాల లక్ష్యం 'ఎంతమంది అక్షరాస్యులయ్యారు?' అనే ప్రశ్నకే పరిమితం కాకుండా 'ఎంతమంది నిజంగా నేర్చుకున్నారు?' అనే ప్రశ్నకు మారాలి.

సమస్యకు మొదటి కారణం పాఠశాల విద్యలో నిరంతరత లేకపోవడం. పిల్లలను పాఠశాలలో చేర్పించడం సులభమే కానీ వారిని పాఠశాలలో కొనసాగించడం అంత సులభం కాదు. పేద కుటుంబాల్లో పిల్లల శ్రమ, కుటుంబ బాధ్యతలు, వలసలు, బాల్య వివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, ప్రయాణ సౌకర్యాల కొరత వంటి అంశాలు విద్యకు అడ్డంకులుగా మారుతున్నాయి. ముఖ్యంగా మాధ్యమిక స్థాయికి చేరిన తర్వాత ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది.

పాఠశాల మానివేత గణాంకాలు దీనికి బలమైన సూచన. 2024-25లో ఆంధ్రప్రదేశ్‌లో మాధ్యమిక స్థాయి డ్రాప్‌అవుట్ రేటు 15.5 శాతంగా నమోదైంది; ఇది దేశ సగటు 11.5 శాతం కంటే ఎక్కువ. ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక స్థాయిల్లో కూడా సమస్య పూర్తిగా తొలగిపోలేదు. అక్షరాస్యతను పెంచాలంటే కేవలం వయోజనులకు అక్షరాలు నేర్పడం కంటే పాఠశాల నుంచి పిల్లలు బయటకు వెళ్లకుండా చూడడం చాలా ముఖ్యమైన వ్యూహం.

మరో ప్రధాన లోపం మహిళల విద్యలో కనిపిస్తుంది. 2023-24 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పురుషుల అక్షరాస్యత 80 శాతం కాగా మహిళలది 65.5 శాతం మాత్రమే. తెలంగాణలో కూడా పురుషుల అక్షరాస్యత 84 శాతం ఉండగా మహిళలది సుమారు 70 శాతం. ఈ లింగ వ్యత్యాసం విద్యా వ్యవస్థ మాత్రమే కాదు, కుటుంబం, సమాజం, ఉపాధి అవకాశాలు, భద్రత, బాల్య వివాహాలు, పేదరికం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంది.

గ్రామీణ-పట్టణ వ్యత్యాసాన్ని కూడా నిర్లక్ష్యం చేయలేం. పట్టణ ప్రాంతాల్లో పాఠశాలలు, ప్రైవేటు విద్య, కోచింగ్, డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు ఎక్కువగా ఉండగా గ్రామీణ పేద కుటుంబాల్లో పిల్లలకు ఇవన్నీ సమానంగా అందుబాటులో లేవు. ఫలితంగా విద్యా వ్యవస్థలో ప్రవేశం పెరిగినా విద్యా ఫలితాల్లో సమానత్వం ఏర్పడటం లేదు.

ఇక్కడ ప్రభుత్వాల విధాన ప్రాధాన్యతలపై కూడా ప్రశ్నలు తలెత్తాలి. పాఠశాల విద్య అనేది ఎన్నికల సమయంలో ప్రకటించే పథకం కాదు; తరతరాలను మార్చే సామాజిక పెట్టుబడి. కొత్త భవనాలు, డిజిటల్ బోర్డులు, యూనిఫారాలు, పుస్తకాలు అవసరమే. కానీ వాటికంటే ముఖ్యమైనది మంచి ఉపాధ్యాయుడు, సరైన ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి, నిరంతర శిక్షణ, బోధన నాణ్యత, పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యం, పాఠశాలల్లో సమర్థవంతమైన పర్యవేక్షణ.

అక్షరాస్యతలో ముందున్న రాష్ట్రాల అనుభవాన్ని పరిశీలించాలి. కేరళ 95.3 శాతం అక్షరాస్యతతో ముందంజలో ఉండగా, గోవా, మిజోరం, నాగాలాండ్, త్రిపుర వంటి రాష్ట్రాలు కూడా 90 శాతానికి పైగా లేదా దానికి సమీపంలో ఉన్నాయి. వీటి నమూనాలను యథాతథంగా కాపీ చేయడం అవసరం లేదు. కానీ విద్యను సామాజిక ఉద్యమంగా చూడటం, మహిళా విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, స్థానిక సమాజాన్ని పాఠశాలలతో అనుసంధానించడం, వయోజన విద్యను కొనసాగించడం వంటి అంశాలను నేర్చుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఇప్పుడు స్పష్టమైన 'అక్షరాస్యత అత్యవసర కార్యాచరణ ప్రణాళిక'ను రూపొందించాలి. ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి పట్టణ వార్డుకు అక్షరాస్యత లక్ష్యాన్ని నిర్ణయించాలి. 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి కుటుంబాల వారీగా ప్రత్యేక విద్యా కార్యక్రమాలు నిర్వహించాలి. మహిళలు, గిరిజనులు, దళితులు, వలస కుటుంబాలు, దివ్యాంగులు, పాఠశాల మానేసిన పిల్లల కోసం ప్రత్యేక వ్యూహాలు రూపొందించాలి. పాఠశాలల్లో 'హాజరు'ని మాత్రమే కాకుండా 'నేర్చుకున్న స్థాయి'ని కొలవాలి. మూడో తరగతి విద్యార్థి రెండో తరగతి పాఠ్యాన్ని చదవగలడా? ఐదో తరగతి విద్యార్థి సరళమైన గణిత సమస్యను పరిష్కరించగలడా? ఎనిమిదో తరగతి విద్యార్థి ఒక పేజీ చదివి దాని భావాన్ని చెప్పగలడా? వంటి ప్రాథమిక విద్యా ప్రమాణాలను ప్రతి సంవత్సరం బహిరంగంగా ప్రకటించాలి. వయోజన అక్షరాస్యతకు కూడా కొత్త రూపం అవసరం. కేవలం సంతకం చేయడం నేర్పడం కాకుండా బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ సేవలకు దరఖాస్తు, ఆరోగ్య సమాచారం, వ్యవసాయ సమాచారం, ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ వంటి అంశాలను కలిపిన 'కార్యాచరణాత్మక అక్షరాస్యత'ను తీసుకురావాలి. గ్రంథాలయాలు, పాఠశాల భవనాలు, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ కార్యాలయాలు ఈ కార్యక్రమానికి కేంద్రాలుగా మారవచ్చు.

అదే సమయంలో ప్రభుత్వాలు గణాంకాలను ప్రచార సాధనాలుగా కాకుండా విధానానికి అద్దంగా చూడాలి. ఒక సంవత్సరం అక్షరాస్యత శాతం పెరిగిందని ప్రకటించడం కంటే ఏ జిల్లాలో ఎంత పెరిగింది, ఏ సామాజిక వర్గం వెనుకబడి ఉంది, మహిళల పరిస్థితి ఏమిటి, ఎన్ని పిల్లలు పాఠశాల మానేస్తున్నారు, నేర్చుకునే ఫలితాలు ఎలా ఉన్నాయి అనే వివరాలను ప్రజల ముందుంచాలి. జవాబుదారీతనం లేకుండా అక్షరాస్యతపై లక్ష్యాలు కాగితంపైనే మిగిలిపోతాయి.ఆంధ్రప్రదేశ్‌లో 2026లో అక్షరాస్యత 82.1 శాతానికి చేరిందన్న తాజా ప్రభుత్వ వాదనలు కూడా వెలువడ్డాయి; 2027 నాటికి 100 శాతం లక్ష్యాన్ని ప్రకటించారు. ఇది నిజంగా స్థిరమైన పురోగతిగా మారాలంటే ఆ గణాంకాల పద్ధతి, నమూనా, వయస్సు పరిమితి, గ్రామీణ-పట్టణ విభజన, లింగ వ్యత్యాసం వంటి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలి. ఒక సర్వేలో వచ్చిన సంఖ్యను మాత్రమే ఆధారంగా చేసుకుని విద్యా వ్యవస్థ విజయవంతమైందని చెప్పడం సరైంది కాదు.

తెలంగాణకూ ఇదే వర్తిస్తుంది. హైదరాబాద్ ప్రపంచస్థాయి ఐటీ నగరంగా ఎదుగుతున్న సమయంలో రాష్ట్రంలోని కొన్ని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరక్షరాస్యత కొనసాగడం అభివృద్ధి నమూనాలోని అసమానతను సూచిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కూ ఇదే సవాలు. అమరావతి, విశాఖపట్నం, విజయవాడ వంటి అభివృద్ధి కేంద్రాల పురోగతితో పాటు వెనుకబడిన మండలాల్లోని పిల్లల విద్యా స్థాయి కూడా రాష్ట్ర ప్రగతికి ప్రమాణంగా మారాలి.

అంతిమంగా, అక్షరాస్యత అనేది విద్యాశాఖకు మాత్రమే చెందిన అంశం కాదు. అది ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, మహిళా సాధికారత, ఉపాధి, పేదరిక నిర్మూలన, ప్రజాస్వామ్య భాగస్వామ్యం అన్నింటికీ పునాది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఆర్థికంగా ముందుకు వెళ్లాలంటే మానవ మూలధనంలోనూ ముందుండాలి. కేవలం ఐటీ పార్కులు, రహదారులు, పరిశ్రమలు నిర్మించడం ద్వారా అభివృద్ధి సంపూర్ణం కాదు. ప్రతి పిల్లవాడు చదవగలగాలి, అర్థం చేసుకోగలగాలి; ప్రతి మహిళ స్వతంత్రంగా సమాచారం చదివి నిర్ణయం తీసుకోగలగాలి; ప్రతి పౌరుడు డిజిటల్, ఆర్థిక, సామాజిక వ్యవస్థలను అర్థం చేసుకోగలగాలి.అందుకే ఇప్పుడు అవసరమైనది మరో అక్షరాస్యత ప్రచారం కాదు-విద్యను ప్రభుత్వాల ప్రధాన అభివృద్ధి ప్రాధాన్యతగా మార్చే రాజకీయ సంకల్పం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు అక్షరాస్యతలో జాతీయ సగటును చేరడం మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, దేశంలో అత్యుత్తమ రాష్ట్రాల సరసన నిలిచే స్థాయిని లక్ష్యంగా పెట్టుకోవాలి. అది సాధ్యమే. కానీ దానికి గణాంకాల ప్రచారం కాదు, పాఠశాల నుంచి కుటుంబం వరకు, ఉపాధ్యాయుడి నుంచి ప్రభుత్వ విధానం వరకు మొత్తం వ్యవస్థలో మార్పు అవసరం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## హామీలు అమలు చేయలేదంటూ బీఆర్ఎస్ నిరసన



**మునిపల్లి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన బాకీ కార్డులు' అర్థాన్ని స్పష్టంగా చేయాలని మునిపల్లి మండల బిఆర్ఎస్ యువత మాజీ అధ్యక్షులు ఆనందరావు పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ మునిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ హామీల అమలుపై ప్రజలకు వివరిస్తూ బాకీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింహులు, సీనియర్ నాయకులు బద్రప్ప, రాజేందర్, నాగరాజ్‌గౌడ్ ,ఆకుల రాజు, ఇల్టెం బిచన్న, కుమ్మరి నర్సింలు, కర్చర్ల శ్రీనివాస్, నవీన్, నరేష్‌గౌడ్, మొల్ల నసీర్, అల్లీం పటేల్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత




**తాండూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలోని శ్రీ బావిగి భద్రేశ్వర దేవాలయ ప్రాంగణంలో శ్రావణ మాసం సందర్భంగా గత 25 రోజులుగా భక్తి శ్రద్ధలతో ప్రవచన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ మడపతి సిద్దలింగయ్య స్వామి మాట్లాడుతూ పరమేశ్వరుడు దయాస్వరూపుడు. భక్తి శ్రద్ధలతో శివ నామ స్మరణ పఠించడం వల్లనే మేలు జరుగుతుంద న్నారు. బసవేశ్వరుని ప్రవచనాలను, బసవ తత్వాన్ని భక్తులకు బోధించారు. శివ నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ నిత్యం శివుని ఆరాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం సర్వసభ్యులు,వీరశైవ యువదళ్, వీరశైవ అక్కమహాదేవి మహిళా కమిటీ, భావిగి భద్రేశ్వర రెన్యూవేషన్ కమిటీ, భావిగి భద్రేశ్వర భజన మండలి సభ్యులు,ఆర్చకులు ,భక్తులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలంటూ శ్రీపాపిరెడ్డి కాలనీ వాసుల నిరసన



**హయత్‌నగర్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** హయత్ నగర్ మండలం సాహెబ్ నగర్ డివిజన్ లోని శ్రీ పాపిరెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. శ్రీ పాపిరెడ్డి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో మౌలిక వసతుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ పాపిరెడ్డి కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. సోమయ్య గౌడ్ మాట్లాడుతూ, కాలనీవాసుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## విలియమ్ మూన్ గ్రౌండ్‌లో పైలెట్ సందడి



**తాండూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** తాండూర్‌లోని విలియమ్ మూన్ గ్రౌండ్ వాకర్స్‌తో సందడిగా కనిపించింది. అదే సమయంలో గ్రౌండ్‌కు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఉదయపు చల్లని గాలిలో గ్రౌండ్ చుట్టూ వాకింగ్ చేస్తూ.. మధ్య మధ్యలో వాకర్స్‌ను పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించారు.ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా వాకర్స్‌లో ఒకరిగా కలిసిపోయి, వారితో సరదాగా మాట్లాడుతూ ముందుకు సాగిన తీరు అందరినీ ఆకట్టుకుంది. వాకింగ్ చేస్తున్న పలువురు వాకర్స్ కూడా పైలెట్ రోహిత్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించి, మీరు మళ్ళీ గెలవాలి మా అందరికీ అండగా ఉండాలంటూ కాసేపు ఆయనతో కలిసి నడుస్తూ ముచ్చటించారు.

# అంబేద్కర్‌ను అవమానిస్తే సహించం

- మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరుశురాం
- హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కీసర పోలీస్‌స్టేషన్‌లో మాల మహానాడు నాయకుల ఫిర్యాదు



**కీసర, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను కించపరిచేలా పుస్తకాన్ని ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరుశురాం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలను మాల మహానాడు నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గుజ్జుక పరుశురాం మాట్లాడుతూ.. 'అంబేద్కర్ కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకాన్ని రచించి ప్రచారం చేయడం ద్వారా ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అంబేద్కర్‌కు ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు ఉందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడిపై నిరాధార ఆరోపణలు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని అన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు అంబేద్కర్‌ను అత్యంత గౌరవంతో చూస్తారని, ఆయన గౌరవానికి భంగం కలిగించే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్‌పై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు కార్యక్రమంలో ఆర్జీకే కాలనీ మాల సంక్షేమ సంఘం సలహాదారు రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గౌతమ్, కోశాధికారి పాడుగుల రూపా చంద్రమౌళి, నాయకులు హనుమంతరావు మహార్, రాజ్‌కిరణ్ మహార్, రఘు మహార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడటం కార్యకర్తల బాధ్యత

- సర్ పై బీఎల్ఏలు, సూపర్‌వైజర్లతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష




**మక్తల్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ద్వారక ఫంక్షన్ హాల్‌లో మక్తల్ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ), సూపర్‌వైజర్లతో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### ఓట్ల తొలగింపుపై ఆందోళన

నియోజకవర్గంలో ఇప్పటికే 36 వేల ఓట్లు తొలగించబడ్డాయని, తాజాగా మరో 76 వేల ఓట్ల తొలగింపునకు నోటీసులు రావడం తీవ్ర ఆందోళనకరమని మంత్రి తెలిపారు. అర్హులైన బీద, బడుగు, బలహీన వర్గాల ఓట్లు అన్యాయంగా రద్దు కాకుండా ప్రతి బూత్ స్థాయిలో పకడ్బందీగా పరిశీలన జరపాలన్నారు. సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి, ప్రతి అర్హుడికీ ఓటు హక్కు దక్కేలా చూడాలని సూచించారు.

పార్టీ ఆదేశాలకు ప్రతి కార్యకర్త వంద శాతం కట్టుబడి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మీరంతా ఓటు వేసి గెలిపిస్తేనే నేను ఎమ్మెల్యే అయ్యాను.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. కష్టకాలంలో పార్టీని కాపాడింది కార్యకర్తలే. పేదల ఓటు హక్కును పరిరక్షించే వ్యక్తే నిజమైన కార్యకర్త అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు పేదలకు చేరాలన్నా, అభివృద్ధి కొనసాగాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అబ్జర్వర్ గుత్తా అమిత్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రేవతి గౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, ఏడు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నల్లబెల్లం అక్రమ రవాణా వాహనం పట్టివేత

- వెల్టూర్ స్టేజి వద్ద పోలీసుల తనిఖీలు
- వాహనం వదిలి డ్రైవర్ పరార్



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** హైదరాబాద్ నుంచి శివారు ప్రాంతాలకు అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఉప్పునుంతల మండలంలోని వెల్టూర్ స్టేజి వద్ద శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాన్ని గమనించారు. పోలీసులను చూసిన డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపి, వాహనం నుంచి దిగి సమీపంలోని చెట్ల పొదల్లోకి వెళ్లి పరారయ్యాడు. అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో నల్లబెల్లం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పరారైన డ్రైవర్ కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. నల్లబెల్లం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పుట్ట మహేష్ హెచ్చరించారు.

## గోమాంసం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎస్సైకి ఫిర్యాదు చేసిన బీజేవైఎం మండల అధ్యక్షులు వొట్టేవోళ్ళ సురేష్



**కృష్ణ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** కృష్ణ మండలం తంగిడిగి గ్రామంలో అక్రమ గోమాం సం రవాణా, అమ్మకంపై బీజేవైఎం మండల అధ్యక్షులు వొట్టేవోళ్ళ సురేష్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక ఎస్సై నవీద్ కు వారు ఫిర్యాదు చేశారు. తంగిడికి గ్రామ పరిధిలో గోమాంసం అక్రమ రవాణా, అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో మండల బీజేవైఎం అధ్యక్షులు స్పందించారు. ఈ అక్రమ కార్యకలాపాలను వెంటనే అరికట్టాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని వారు ఎస్సైను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్సై నవీద్ ఇలాంటి అక్రమ గోమాంసం రవాణా అమ్మకం ఇకనుండి ఎవరైనా జరిపితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని గ్రామస్తులను హెచ్చరించారు. ఇలాంటివి ఇంకోసారి జరగకుండా గోవధ నిషేధిత చట్టం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తంగిడిగి గ్రామ సర్పంచ్ కు సూచించారు. ఈ ఘటనకు కారణమైన వాళ్లను ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్ట బోమని కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండల బీజేవైఎం అధ్యక్షులు వొట్టే వోళ్ళ సురేష్ మాట్లాడుతూ, గో సంరక్షణకు సంబంధించిన చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. గ్రామంలో అక్రమ గోమాంసం రవాణా, అమ్మకాలు కొనసాగితే సామాజిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠినంగా పెట్టాలని, మళ్లీ ఇలాంటి అక్రమ కార్యకలాపాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండి, ఇలాంటివి మళ్లీ కనిపిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఉప్పల్‌లో మట్టి వినాయకుల పంపిణీకి శ్రీకారం



**ఉప్పల్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముస్యం శ్రీనివాస్‌కు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ప్రతి సంవత్సరం గణేష్ నవరాత్రుల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తుంటారు. అయితే పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాల్సిన అవసరం ఉందని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు తెలిపారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలగకుండా ఉండటంతో పాటు, నీటి వనరుల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల మహేందర్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షులు ఈరెల్లి రవీందర్ రెడ్డి, భాషపల్లి నిరంజన్ చారి, జెట్ట కిషోర్, ఏమండ్ల రామ్ రెడ్డి, సభ్యులు కాడిగే శేఖర్, అలెగ్జాండర్, బందారం రాఘవేందర్ గౌడ్, పగిడి యుగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపొద్దు




**శంషాబాద్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపడం, పార్కింగ్ చేయడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ తెలిపారు. ఆదివారం ఓఆర్ఆర్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు, ఐఆర్బీ అధికారులు సంయుక్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు "ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలపవద్దు.. పార్కింగ్ చేయవద్దు" అంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. వాహనదారులు సురక్షితంగా డ్రైవింగ్ చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాల్లో సమస్యలు తలెత్తితే రోడ్డుపై నిలపకుండా సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు. ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కోరారు.

## ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీల బలోపేతానికి కృషి

- ఉద్యమ కార్యాచరణలో భాగస్వాములు కావాలి
- వరంగల్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి




**కల్వకుర్తి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** కల్వకుర్తి కేంద్రంలో ఎంఆర్‌పీఎస్,ఎంఎస్‌పీ పార్టీ మండలాల నూతన కమిటీల ప్రధాన నాయకులతో సమావేశం నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు జానకి రామయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జిలు ఆడెపు నాగార్జున మాదిగ, మద్దిలేటి మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ 30 ఏళ్లుగా మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మగౌరవం, హక్కుల సాధనతో పాటు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణలో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించే ఫలాలను ఎస్సీ కులంలోని ఉపకులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెలలో వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కరిగేళ్ల దశరథం మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి పర్వపాకుల శేఖర్ మాదిగతో పాటు విల్సన్ మాదిగ, రాజమౌళి మాదిగ, రాముడు మాదిగ, భగవంతు మాదిగ, పర్శరాములు మాదిగ, అంజి మాదిగ, కుర్మయ్య మాదిగ, చంటి మాదిగ, శ్రీను మాదిగ, పరమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
07 సెప్టెంబర్ 2026

# కరెంట్ కోతలపై భగ్గుమన్న అన్నదాత

- రోడ్డెక్కి రాస్తారోకో..!
- సాగునీరందక ఎండుతున్న పంటలు
- లో-వోల్టేజీతో కాలిపోతున్న మోటార్లు
- పట్టించుకోని అధికారులు
- రహదారిపై భారీగా స్తంభించిన ట్రాఫిక్
- విద్యుత్ శాఖ హామీతో శాంతించిన రైతాంగం

**మక్తల్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలపై రైతాంగం భగ్గుమంది. వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ సరఫరా చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్నదాతలు రోడ్డెక్కారు. ఆదివారం ఉదయం ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో వాహనాల రాకపోకలు గంటల తరబడి స్తంభించిపోయాయి.



### కళ్లముందే ఎండిపోతున్న పంటలు

ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కీలకమైన పంట దశలో రోజుకు కనీసం నాలుగైదు గంటలు కూడా నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన అరకొర కరెంట్ కూడా తీవ్రమైన లో-వోల్టేజీతో వస్తుండటంతో వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోయి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని వాపోయారు. పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నీరందక కళ్లముందే ఎండుతుంటే గుండె తరుక్కుపోతోందని, రాత్రి వేళల్లో కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక పాములు, తేళ్ల భయంతో పొలాల వద్దే జాగారాలు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు.

రహదారిపై బైఠాయింపుతో ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ ఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. సాంకేతిక సమస్యల వల్లే సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, తక్షణమే మరమ్మతులు పూర్తి చేసి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే రాబోయే రోజుల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- సర్పంచ్ బండమీది సంతోషి కర్ణాకర్



**చేర్యాల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** సమాజంలో అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సర్పంచ్ బండమీది సంతోషి కర్ణాకర్ అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాగపురి గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల, ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ,గండికుంట,అంగన్వాడీ, ప్రీ ప్రైమరీ లో పనిచేస్తున్న 32 మంది ఉపాధ్యాయులకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. సమాజానికి కావలసిన అన్ని రంగాల నిపుణులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే అయిలయ్య, మల్లికార్జున్ రెడ్డి, అంబిక,శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఆవుల సందీప్,వార్డు సభ్యులు చిరుమల్ల కర్ణాకర్, భూలక్ష్మీ నర్సింగరావు, నడిగొట్టు మహేశ్వరి ఉపాధ్యాయులు కృష్ణమూర్తి,ప్రకాష్ రెడ్డి, మనోజ్ కుమార్,విజయ్,ప్రజ్ఞాపురం నర్సింహులు పాల్గొన్నారు.

## ఐక్య ఉద్యమంతోనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం

- జిల్లా అధ్యక్షులు బండారి యాదగిరి




సంగారెడ్డి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమిస్తేనే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని టీయూడబ్ల్యూజే – ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అన్నారు. నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన టి యు డబ్ల్యూ జే (ఐజేయు) యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్, ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ జర్నలిస్టులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, హక్కుల సాధనకు సంఘటిత శక్తే ప్రధాన బలమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# భవిష్యత్ ఎలక్ట్రికల్ వాహనాలదే..

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**శివ్వంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** దేశంలో నానాటికి పెరిగిపోతున్న కాలుష్య కారకాలను తప్పించడానికి ప్రతి ఇంటిలో ఒక ఎలక్ట్రికల్ వాహనాన్ని వినియోగించాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు. శివ్వంపేట మండలం శబాష్ పల్లి శివారులో అయ్యవారి షాదుల్ల ఏర్పాటు చేసిన ఆర్జీఎస్ వాహనాల ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ను జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవితో కలిసి ఆదివారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో రఘునందన్ రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలు తమ స్వంత వాహనాలను వినియించుకోవడంతో పూర్తిగా ఇందనంపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అయితే వివిధ దేశాలలో ఉన్న యుద్ధ పరిస్థితుల దృష్ట్యా అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడాయిల్ ధరలు అమాంతం పెరిగిపోయిన విషయాన్ని గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొత్త ఆలోచనలతో సోలార్ విద్యుత్ వినియోగం వైపు మనల్ని మళ్లించారని ఎంపీ గుర్తు చేశారు. ఇంటింటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడం కేంద్ర ప్రభుత్వం రూ.70 వేలు అందిస్తోందన్నారు. ప్రత్యామ్నాయ ఇందన వనరుల వినియోగం కోసం సోలార్, ఎలక్ట్రికల్ వాహనాలను విరివిగా వాడాలని సూచించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే



ప్రతి ఇంటికి ఒక ఎలక్ట్రికల్ వాహనాన్ని తప్పక కొనుగోలు చేయాలనీ ఆయన అన్నారు. మారుమూల ప్రాంతంలో ఈవీ రీఛార్జింగ్‌కు ఇబ్బందులు కావొద్దనే ఉద్దేశ్యంతో ముందుకొచ్చిన శబాష్ పల్లి అయ్యగారి షాదుల్లను తాను మనస్పూర్తిగా అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పెద్ద పులి రవి, శబాష్ పల్లి సర్పంచ్ అయ్యగారి యాదగిరి, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకన్నగారి కొండల్ రావు, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి భిక్షపతి, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు, అశోక్ షాదుల్ల, మామిడి నర్సారెడ్డి, దుబ్బ వెంకటేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పారిశుధ్యం, పర్యావరణం నిర్లక్ష్యం



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో పట్టణంలోని పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, దేవర్ల నరసింహ విమర్శించారు. బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీనివాసపూర్ 8వ వార్డులో మురికి కాలువల నిర్వహణ, హరితహారం నర్సరీ పరిస్థితిపై నిరసన తెలిపారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హయాంలో శ్రీనివాసపూర్‌లో రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన నర్సరీ ద్వారా పార్కులు, హరితహారం కోసం నాణ్యమైన మొక్కలను సరఫరా చేసేవారని తెలిపారు. రూ.50--60 లక్షలతో ఏర్పాటు చేసిన పాలీహౌస్ ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై వినియోగం లేకుండా పోయిందని, సుమారు రూ.20 లక్షలు కేటాయిస్తే నర్సరీని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చేయవచ్చన్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, పారిశుధ్యం, పర్యావరణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. 8వ వార్డు కౌన్సిలర్ శంకరమ్మ బాబు నాయక్ అధ్యక్షతన, రైతు సమితి అధ్యక్షుడు దేవర్ల నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ చల్మారెడ్డి సేవలు చిరస్మరణీయం



వనపర్తి రూరల్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ చల్మా రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం హాజరై నివాళు లర్పించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, వైద్య రంగంలో డాక్టర్ చల్మారెడ్డి అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజలకు వైద్య సేవలందిస్తూ వారితో ఏర్పరచుకున్న అనుబంధం చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం చల్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, ఉంగ్లం తిరుమల్, కౌన్సిలర్ అరుణ, మెకానిక్ శ్రీను, మంద రాము తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

### ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నిజాంపేట్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ మండలంలోని బాచేపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పత్తిగారి లక్ష్మి, ఉపసర్పంచ్



బూమ్‌శెట్టి సరితా పెంటయ్య, నారాయణఖేడ్ కాంగ్రెస్ యువ నాయకుడు పత్తిగారి శ్రీకాంత్, కాంగ్రెస్ కార్యకర్తలు సహకరి శివ, బాబ్య నాయక్, సురేష్, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలంటూ బీఆర్ఎస్ నిరసన



**సదాశివపేట, సెప్టెంబరు 6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సదాశివపేట మండల పరిధి ఇశ్రితాబాద్ గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాలతో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ కోడూరి రాములు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ హామీ కార్డులు పంపిణీ చేసి, చీపుర్లతో రోడ్లు ఊడ్చుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్కే. బాబూమియా, వార్డు సభ్యులు ఎండీ. రవూఫ్, ఎండీ. ఇమ్రాన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం

- ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన
- మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా

**ఉర్కొండ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** మండలంలోని ఉర్కొండపేట గ్రామంలో మాజీ మంత్రి డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ నిరసన చేపట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పల్లెలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధ్వాన స్థితికి చేరుకున్నాయని ఉర్కొండ పేట మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ వైఫల్యాలను, పల్లెల పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.



ఈ కార్యక్రమంలో కర్నాటి శ్రీనివాస్ గౌడ్, బోల్గాం యాదయ్య గౌడ్, పర్వతాలు గౌడ్,రాజేష్ చారి, సాదిక్ , కొండ గిరి, కలమ్మ ,కప్పెర చందు, బాలు, అంజి, తిరుపతి, మల్లేష్, పోలే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రాజీనామా చేయాలి

- రసమయి బాలకిషన్ భాష మార్చుకోవాలి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో బెజ్జంకిలో భారీ ర్యాలీ, ధర్నా

**బెజ్జంకి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని,మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తన భాష మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ,మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ,ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీకి హాజరుకాకుండా కేసీఆర్ ప్రజాధనాన్ని తీసుకుంటూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ రాజకీయాలు చేస్తున్న కేసీఆర్ తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితుడు స్పీకర్‌గా ఉన్న అసెంబ్లీకి హాజరుకాకపోవడం దళితుల పట్ల అవమానకర వైఖరికి నిదర్శనము అనీ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై రసమయి బాలకిషన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము అని అన్నారు. అధికారాన్ని కోల్పోయిన నిరాశతో రసమయి ఇష్టారీతిన



మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని లింగాల శ్రీనివాస్ విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి,దళితులకు మూడు ఎకరాల భూమి,దళితబంధు,కొత్త రేషన్ కార్డులు,కొత్త పెన్షన్లు,రుణమాఫీ,ఉచిత ఎరువులు,డబుల్ బెడ్‌రూం ఇళ్లు,బీసీ బంధు,ఇంటికో ఉద్యోగం వంటి హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ,పేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ,కొత్త రేషన్ కార్డులు,కొత్త పెన్షన్లు,సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీ కులగణన చేపట్టి రిజర్వేషన్ల కోసం కృషి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అనీ అన్నారు. ప్రజలు సంతోషంగా ఉండటాన్ని బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక నిరసనలు,విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తారని,తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్,మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, డైరెక్టర్లు బైర సంతోష్,కుక్కల రాములు, శంకర్, రామచంద్రం,నర్సింగరావు,ఒంటెల సంపత్‌రెడ్డి,రావుల నర్సయ్య,జెల్ల ప్రభాకర్,పర్ష సంతోష్,వివిధ గ్రామాల సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కరవుల సందీప్,కుంట హరికృష్ణ,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు,మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామాయంపేట నియోజకవర్గ ఏర్పాటుకై జర్నలిస్టుల దీక్ష



**నిజాంపేట, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** గతంలో రామాయంపేట నియోజకవర్గం ఉండేదని, మళ్లీ నియోజకవర్గన్నీ ఏర్పాటు చేయాలని నిజాంపేటలో ఆదివారం మండల జర్నలిస్ట్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రామాయంపేట నియోజకవర్గంగా ఏర్పడితే అన్ని మండలాలు అభివృద్ధి చెందుతాయని, 1952 నుంచి 2009 వరకు రామాయంపేట నియోజకవర్గంగా కొనసాగిందన్నారు. అదేవిధంగా మళ్లీ రామాయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దీక్షకు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, మండల అధ్యక్షులు సిద్దారాం రెడ్డి అలాగే బీఆర్ఎస్వి మండల అధ్యక్షుడు రంజిత్ గౌడ్ లు, మావురం రాజు లు సంఘీభావం తెలిపారు. మళ్లీ రామాయంపేట ను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని, కోరారు. జర్నలిస్ట్ లు బండారి చంద్రం, సంజీవ్, సిద్దరాములు, బాలరాజు తదితరులు ఉన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం

- నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూర్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి):** ఆదివారం ఆత్మకూరు మండలం లింగమడుగు పల్లి, కామారం,గుడెప్పాడ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి, సందర్భంగా లబ్ధిదారులకు శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకు న్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారం భోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గూడెప్పాడు సర్పంచ్ పరికి రమేష్ బాబు, జిల్లా నాయకులు కక్కెర్ల రాజు గౌడ్, మార్కా రజినీకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యోగా పోటీల్లో కోలశాన్వికి గోల్డ్ మెడల్



**కాళేశ్వరం, సెప్టెంబర్ 06 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఆదర్శ స్కూల్ లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీల్లో కాళేశ్వరం గ్రామానికి చెందిన బాలిక ప్రతిభ చాటింది. తెలంగాణ యోగా అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో కాళేశ్వరం గ్రామానికి చెందిన కోల జయసుధ-దుర్గరాజ్ దంపతుల కుమార్తె కోల శాన్వి అండర్ 8--10 సంవత్సరాల విభాగంలో పాల్గొని అద్భుతమైన యోగాసనాలు ప్రదర్శించింది. తన ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించింది.అతి చిన్న వయసులోనే జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించడం పట్ల బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం గ్రామం నుంచి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటడం గర్వకారణంగా ఉందన్నారు.ఈ సందర్భంగా యోగ కోచ్ వావిల్ల కిష్టయ్య కోల శాన్వి నీ అభినందించారు. ఈ నెల 11వ తేదీన కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు బాలిక ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# పేద విద్యార్థి ప్రతిభ

- కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు
- ఆర్థిక సహాయం కోసం తల్లి



**పెద్దవంగర సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** మండలంలోని వడ్డెకొతపెల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి దంతలపల్లి గోపీచంద్ (20) పేదరికాన్ని జయించి వైద్య విద్యలో సీటు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.గోపీచంద్ 10వ తరగతి హైదరాబాద్ గాంధీనగర్ లోని ప్రైవేట్ పాఠశాలలో 10/10 జి పి ఎ ఇంటర్మీడియట్ గౌలిదొడ్డి ప్రభుత్వ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 980 మార్కులతో ఉత్తీర్ణుడై, నీట్ లో 1.25.000 ర్యాంక్ సాధించి కాకతీయ మెడికల్ కాలేజీ కె ఎం సి వరంగల్ లో ఎం బి బి ఎస్ సీటు పొందాడు. తండ్రి లేట్ ప్రవీణ్ కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. తల్లి సైదా కూలి పని చేసుకుంటూ ఇద్దరు కొడుకులను కష్టపడి చదివిస్తోంది. కుటుంబానికి సొంత భూమి గానీ, ఆదాయ వనరు గానీ లేదు.ఎం బి బి ఎస్ ఫీజు, హాస్టల్, పుస్తకాల ఖర్చు దాదాపు లక్షల్లో ఉండటంతో తల్లి సైదా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రతిభ ఉన్నా డబ్బు లేక చదువు ఆగిపోతుందేమోనని ఆవేదన చెందుతోంది.కాబట్టి దాతలు, దయగల హృదయులు గోపీచంద్ చదువుకు సహాయం చేయాలని తల్లి సైదా వేడుకుంటున్నారు.

## వయోవృద్ధుల సేవే.. నిజమైన మానవ సేవ..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వయోవృద్ధులు సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం ఎంతో విలువైనవని, వారి సేవే నిజమైన మానవ సేవ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లిలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన 'ప్రణామ్' వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో వారికి ఆరోగ్యంతో పాటు ఆప్యాయత, భద్రత, గౌరవం, మానసిక ప్రశాంతత అవసరమని అన్నారు. ఈ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసి వారికి ఉపయోగపడేలా నిర్వహించాలని సూచించారు. రెడ్ క్రాస్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, అదే భవనంలో వయోవృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యవంతమైన భవనం ఏర్పాటు చేయాలని, రెడ్ క్రాస్ గుర్తు స్పష్టంగా ఉండేలా చూడాలని అన్నారు. డే కేర్ సెంటర్ ను మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, వయోవృద్ధులు ఆనందంగా గడిపేలా ఆరోగ్యం, వినోద కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొంరయ్య, రెడ్ క్రాస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో విశిష్ట సేవలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్న వశిష్ట ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మాధవికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. సమర్థవంతమైన నాయకత్వం, విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు మెరుగైన విద్య అందించేందుకు మాధవి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అధికారులు ప్రశంసించారు. పురస్కారం అందుకున్న మాధవిని పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, అధ్యాపక బృందం అభినందించారు.

# రూ.374 కోట్లతో బాసర ఆధ్యాత్మిక నగరిగా అభివృద్ధి

- గోదావరి పుష్కర ఘాట్లకు రూ.20 కోట్లు, జ్ఞాన సరస్వతి ఆలయానికి రూ.354 కోట్లు
- పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**బాసర, సెప్టెంబర్ 06(జనం సాక్షి) :** తెలంగాణ ఆధ్యాత్మిక రాజధానిగా పేరొందిన బాసరకు మహర్దశ పట్టింది. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. మొత్తం రూ.374 కోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం బాసరలో మంత్రి జూపల్లి కృష్ణారావు భూమిపూజ చేశారు.వచ్చే ఏడాది జూన్ 27 నుంచి జరగనున్న గోదావరి మహా పుష్కరా లను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏడాది ముందుగానే సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా బాసరలో రూ.20 కోట్లతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలునిర్వహించారు. అదేవిధంగా బాసర అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం రూ.354 కోట్లతో చేపట్టనున్న నూతన నిర్మాణ పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. "తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా గోదావరి పుష్కరాలను నిర్వహిస్తాం. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఏడాది ముందుగానే రూ.1000 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 12 పుష్కర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాం. భక్తుల సౌకర్యం, భద్రతే మా ప్రధాన లక్ష్యం" అని అన్నారు. భక్తుల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, 24 గంటల వైద్య శిబిరాలు, తాగునీరు, పార్కింగ్, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పనుల నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని, ప్రజాభవన్ లో ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పుష్కర ఏర్పాట్ల మ్యాపులు, ప్రతిపాదనలను మంత్రికి వివరించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, మాజీ ఎమ్మెల్యే, నారాయణ పటేల్, జీవిత రెడ్డి, భారీగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కొలువులకు 70 రోజుల ఉచిత శిక్షణ!

- శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన వారికి డేస్ స్కాలర్ క్లాసులు..
- సుమారు 350 మంది అభ్యర్థులకు పరీక్షలు..
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పోలీస్ కొలువుల కోసం నిర్వహించే 70 రోజుల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు. పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న జిల్లా యువతకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ అండగా నిలుస్తోంది. పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్‌ను దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగ యువతకు ఉచిత డేస్ స్కాలర్ క్లాసులతో పాటు గ్రౌండ్ కోచింగ్ అందించేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభ్యర్థులకు శారీరక పరీక్షలు నిర్వహించి, అనంతరం సింగరేణి హైస్కూల్‌లో రాత పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. సింగరేణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రాత పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను తనిఖీ చేసి, పరీక్షలు రాస్తున్న అభ్యర్థులతో మాట్లాడి వారి సన్నద్ధతను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అందివచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 70 రోజుల పాటు ఉచిత డేస్ స్కాలర్ క్లాసులతో పాటు గ్రౌండ్ కోచింగ్ అందించనున్నట్లు అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ తెలిపారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ సాధనే లక్ష్యంగా క్రమశిక్షణతో చదువుతో పాటు శారీరక దృఢత్వంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యేలా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్పీ సంకీర్త్ ఆకాంక్షించారు. కష్టపడి చదివి, శారీరకంగా సిద్ధమై పోలీస్ ఉద్యోగాన్ని సాధించడం ద్వారా తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు రత్నం, సంతోష్ కుమార్, కాశీరాం, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఎనుమాముల ఈవీఎం గోదాం తనిఖీ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం నగరంలోని వేణుమాముల మార్కెట్ యార్డులోని గోదాంలో ఉన్న భద్రతా చర్యలు, నిర్వహణ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డియార్వో విజయలక్ష్మి ,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ 'నంది' అవార్డు అందుకున్న దేవేందర్



**పాలకుర్తి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి)** హైదరాబాద్ కింగ్ కోటి లోని బొగుల్ కుంట తిలక్ రోడ్ లో గల తెలంగాణ సరస్వతి పరిషత్ భవనంలో అమెచ్యూర్ స్పోర్ట్స్ అండ్ కల్చర్ అసోసియేషన్ సభ్యులు అమర్ సింగ్, కేశవ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డు (2026) ప్రధానోత్సవములో భాగంగా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన సిద్ధార్థ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, కుంగ్ ఫూ మాస్టర్ గూడూరు గ్రామానికి చెందిన న్యూ స్టార్ చైనీస్ కుంగ్ ఫూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాస్టర్ గుగ్గిళ్ళ దేవేందర్ కు గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ మార్షల్ ఆర్ట్స్ ప్రతిష్టాత్మక నంది అవార్డు లభించింది . గత 20 సంవత్సరాలుగా కరాటే రంగంలో మాస్టర్ దేవేందర్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది ఎంతోమంది విద్యార్థులను రాష్ట్ర ,జాతీయ స్థాయిలలో ఉత్తమ కరాటే క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నైపుణ్యానికి గాను ఈ గౌరవం దక్కినట్లు నిర్వాహకులు తెలిపారు .ఈ అవార్డును ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాల ప్రదర్శకులు, గ్రాండ్ మాస్టర్ పూసపాటి మురళీకృష్ణం రాజు, మూవీ ఆర్టిస్ట్ శివం, సంజయ్, చైల్డ్ ఆర్టిస్ట్ సుహాని చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా కుంగ్ ఫూ మాస్టర్ గుగ్గిళ్ళ దేవేందర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక మార్షల్ ఆర్ట్స్ నంది అవార్డు అందుకోవడం నా జీవితంలో మరువలేని అనుభూతి అన్నారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ మహమ్మద్ సలీం పాషా, సిద్ధార్థ పాఠశాల ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్. పాఠశాల అధ్యాపక బృందం దేవేందర్ ను అభినందించారు.

## పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య



**నల్లబెల్లి, సెప్టెంబరు 06(జనంసాక్షి):** భర్త అనారోగ్యం, కుటుంబ పరిస్థితులపై మానసికంగా కలత చెందిన ఓ మహిళ పురుగుమందు తాగి మృతి చెందింది సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. నారక్కపేట గ్రామానికి చెందిన నౌగిరి రాధాబాయి (58) భర్త రాజలింగం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ పరిస్థితులపై మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆటోలో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2 గంటల సమయంలో రాధాబాయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు.

## నడికుడ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు..!

**నడికూడ సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ బలోపేతంపై గ్రామాల అభివృద్ధి పై దృష్టి పెట్టాల్సిన సమయంలో. నడికూడ మండలంలో మాత్రం సొంత గూటిలోనే అంతర్గత విభేదాలు తెరపైకి వస్తున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగాసాగుతోంది. నాయకుల మధ్య సమన్వయం కొరవడటం, ఎవరి వర్గానికి వారే ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రయత్నాలు పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కాంగ్రెస్‌లోని కొందరు నాయకులు పార్టీ కార్యక్రమాలను సమిష్టిగా నిర్వహించకుండా తమ తమ అనుచరులతో ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే చర్చ జరుగుతుంది దీంతో పార్టీ కార్యక్రమాల్లో కూడా వర్గాల ప్రభావం కనిపిస్తోందని స్థానికంగా వినిపిస్తోంది.

నాయకుల మధ్య సమన్వయ లోపంతో గ్రామస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకున్న కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని, వ్యక్తిగత ఆధిపత్య పోరుకు దూరంగా ఉండాలని పలువురు కార్యకర్తలు కోరుకుంటున్నట్లు సమాచారం. నడికుడ మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నికల విషయంలో గెలిచిన ప్రథమ పౌరులకు పోటీలో నిలబడి ఓడిపోయిన నాయకులకు సమాచారం తెలపకుండానే నాయకులు కమిటీలు వేయడం పై గెలిచిన ఓడిన నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

నడికూడలో నెలకొన్నట్లు చెబుతున్న అంతర్గత విభేదాలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపకపోతే భవిష్యత్‌లో పార్టీపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# గంజాయి సాగుపై ఉక్కుపాదం

- గంజాయి సాగు,అక్రమ రవాణా, నిల్వకు పాల్పడితే కఠిన చర్యలు
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి ):** సిర్పూర్ (యు) మండలశీలోనీ బుర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిషేధిత గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ నితికా పంత్,పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బుర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జీర్లఘాట్,గుట్టగూడ గ్రామా శివారులలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టగా,అక్కడ అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు గుర్తించారు. దీంతో పోలీసులు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని,గంజాయి సాగుకు పాల్పడుతున్న మూడు వేర్వేరు కేసులలో మొత్తం నల్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 460 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

గెడం లోబాజీ, గెడం జయవంత్ (బూర్నూరు గ్రామ పంచాయతీ లోని జీర్లగాట్ నివాసులు), కుమ్రా మాధవరావు (బూర్నూరు గ్రామ పంచాయతీ లోని జీర్లగాట్ నివాసుడు), పెందోర్ సూర్యబాను(గుట్టగూడ గ్రామస్తుడు)లను నిందితులుగా పోలీసులు గుర్తించారు. నిందితులు వారి వ్యవసాయ భూమిలలో సాగు చేస్తున్న మొక్కలను పోలీసు వారు గుర్తించారు ఈ ఘటనలలో నిందితుల పై పోలీసు వారు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి సాగుకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గంజాయి సాగు చేసినా, గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా లేదా అక్రమ కార్యకలాపాలకు సహకరించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలను కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా,తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ గంజాయి సాగు మరియు రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.

# తుమ్మలచెరువుకు గోదావరి జలాలు..

- రైతుల కళ్లలో ఆనందం!
- మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ విజయవంతం
- రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**అశ్వాపురం, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అశ్వాపురం మండల రైతుల కల సాకారమైంది. సీతారామ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలను తరలించే ట్రయల్ రన్ ఆదివారం విజయవంతమైంది. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇరిగేషన్ అధికారులతో కలిసి స్విచ్ ఆన్ చేసి నీటిని తుమ్మలచెరువుకు తరలించారు. గోదావరి జలాలు తుమ్మలచెరువును తాకడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. నీటిని చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తమకు పండుగ రోజని తెలిపారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంది.



### నా రాజకీయ జీవితంలో ఇదొక మైలురాయి

ట్రయల్ రన్ విజయవంతం కావడం తన రాజకీయ జీవితంలో మరిచిపోలేని రోజని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. "రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ రైతుల కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు తుమ్మలచెరువుకు చేరడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. నీళ్లు ఉరకలేస్తుంటే ఆనందభాష్పాలు వచ్చాయి" అని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను రాత్రింబవళ్లు రెండు షిఫ్టుల్లో పూర్తి చేసేందుకు కృషి చేసిన ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. "రైతు బెంగపడాల్సిన అవసరం లేదు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ అని నిరూపిస్తాం. మిగిలిన పనులను వారం రోజుల్లో పూర్తి చేసి మంత్రుల చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభించి రైతులకు అంకితం చేస్తాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కుడికాలువ పనులను కూడా వేగవంతం చేసి అశ్వాపురం మండలంలోని మరిన్ని ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు మాట్లాడుతూ "ప్రతిపక్షాల ఆరోపణలకు ట్రయల్ రన్‌తోనే సమాధానం లభించింది. గోదావరి జలాలను తుమ్మలచెరువుకు విజయవంతంగా తరలించాం. త్వరలోనే మంత్రులను ఆహ్వానించి పండుగ వాతావరణంలో రైతులకు నీటిని అందిస్తాం. రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం." సీపీఎం నేత స్థానిక రైతు, సర్గం బాలనరసయ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మారెళ్లపాడు ప్రాజెక్టు కోసం రైతులు ఎదురుచూశారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నాయకుడు సర్గం బాలనరసయ్య అన్నారు. గత ప్రభుత్వాలకు అనేకసార్లు వినతులు ఇచ్చినా ప్రాజెక్టు పూర్తికాలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలను తరలించడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రాజెక్టుతో ఐదు నుంచి ఆరు గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి తుమ్మలచెరువుకు గోదారి జలాలు తరలించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

### భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు

మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం భూములు కోల్పోయిన రైతులు ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలకు నీరు అందనుండటంతో సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. వారి సహకారం మరువలేనిదని, భూములు అందించిన రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### రైతుల కల సాకారం

మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అశ్వాపురం మండల రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. తుమ్మలచెరువుకు గోదావరి జలాలు చేరడంతో ఆయకట్టు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి ముత్యాలమ్మ తల్లి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ముత్యాలమ్మ జాతర నిర్మాణ కమిటీ ఆహ్వానం మేరకు దేవస్థానంకు విచ్చేసిన మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి కి ఆదివారం ముత్యాలమ్మ జాతర కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హుజూర్ నగర్ ప్రాంతంలో ముత్యాలమ్మ తల్లి జాతరకు ఒక ప్రాముఖ్యత ఉందని, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా భక్తులు భావిస్తారని అందుకే అమ్మవారిని ప్రతి ఏటా ఎన్ని పనులున్నా దర్శనం చేసుకుంటానని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ఆ పంటలకు మంచి రేటు రావాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్య సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా దేవస్థాన అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ముందు ముందు కూడా ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. మంచి ఏర్పాట్లు చేసి పండుగ వాతావరణం తీసుకొచ్చిన కమిటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ వారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో హాలియా విద్యార్థుల ప్రతిభ



**హాలియా , సెప్టెంబరు 6 (జనంసాక్షి) :** జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాపోలు సుదర్శన్ పర్యవేక్షణలో నకిరేకల్‌లో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో హాలియాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షల్లో ఉమైమా అతుఫా హుదా, నిఖిలేష్, శివ పార్థు బ్లూ బెల్ట్ సాధించగా, షేక్ అఫ్ఫాన్ హాది, యశ్వంత్, మోక్షిత్ గ్రీన్ బెల్ట్ సాధించారు. అబ్దుల్ వహాబ్ జూనియర్ రెడ్ బెల్ట్ సాధించినట్లు కోచ్ సెన్సాయ్ వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా బెల్ట్ గ్రేడింగ్‌లో విజయం సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ఎండుతున్న 'తెల్లబంగారం'

- వర్షాభావంతో చింతపల్లి మండలంలో రైతుల ఆందోళన
- పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్

**చింతపల్లి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. చింతపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి. గ్రామంలో దాదాపు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగించే రైతులు, వర్షాలు సకాలంలో కురవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయినిగూడెం గ్రామంలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారమే. ప్రత్యామ్నాయంగా సాగునీరు అందించేందుకు బోర్లు, బావులు వంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి



నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి అరకొర తుంపర వర్షాలే కురవడంతో రైతులు ఎంతో ఆశతో పత్తి పంటను సాగు చేశారు. అయితే పత్తి పంటకు అవసరమైన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పైరు ఎదుగుదల లేక భూమి మట్టానికే పరిమితమై ఎండిపోయే దశకు చేరుకుంది. దీంతో ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి పంటపై పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని, చింతపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వ్యవసాయశాఖ అధికారులతో పంట నష్టం అంచనాలను సమగ్రంగా సర్వే చేయించాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన పత్తి రైతులకు తగిన పంట నష్టపరిహారం అందించడంతో పాటు, కరువు పరిస్థితుల నేపథ్యంలో మూగజీవాలకు అవసరమైన పశుగ్రాసాన్ని కూడా ప్రభుత్వం అందించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతు నష్టపోతే వ్యవసాయమే కాదు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి" అని రైతులు కోరుతున్నారు.

## గట్టుప్పల్‌లో బాల్య వివాహ కలకలం

- 9వ తరగతి విద్యార్థినికి పెళ్లి ప్రయత్నం..
- తండ్రి లేని బాలికపై బలవంతపు పెళ్లి ఆరోపణలు

మర్రిగూడ/గట్టుప్పల్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) : నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలికకు బలవంతంగా వివాహం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాలికకు తండ్రి లేకపోవడంతో కుటుంబ పరిస్థితులను ఆసరాగా చేసుకుని పెళ్లి చేయాలని ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలిక ప్రస్తుతం చదువుకుంటున్నప్పటికీ ఆమెకు వివాహం చేయాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో బాల్య వివాహాన్ని అడ్డుకుని బాలిక విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బాల్య వివాహం చట్టవిరుద్ధమని, మైనర్ బాలికలకు వివాహం చేయడం వల్ల వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని పలువురు పేర్కొన్నారు. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాలికకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## దౌల్తాబాద్‌లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతం
- 24 గంటలలో కేసు చేదించిన పోలీసులను అభినందించిన కమిషనర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మతాశిశు సంరక్షణ ఆసుపత్రి నుంచి బాలుడిని కిడ్నాప్ చేసిన మహిళ తో పాటు ఓ వ్యక్తి పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఆసుపత్రి నుంచి పిల్లలకు చాక్లెట్ ఆశచూపి బాలుడిని కిడ్నాప్ చేసింది. దీంతో ఈ విషయం జిల్లాలో కలకలం రేపింది. బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి చికిత్స నిమిత్తం మతాశిశు ఆసుపత్రికి వచ్చారు. అయితే ఇదే క్రమంలో ఓ మహిళ ఓ వ్యక్తితో కలిసి బాలుడిని కిడ్నాప్ చేసింది. తల్లిదండ్రులు ఆసుపత్రిలో బాలుడు కనిపించకపోవడంతో డయల్ 112కు ఫిర్యాదు చేయగా పోలీసులు రంగంలోకి దిగారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా ఓ మహిళ బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్నట్లు రికార్డయ్యాయి. సీపీ సాయిచైతన్య 8 బృందాలను ఏర్పాటు చేశారు. ఏసీపీ శ్రీశైలం ఆధ్వర్యంలో మహిళతో పాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ లో వారిని ప ట్టుకుని బాలుడిని రక్షించారు. బాలుడు ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులతో పాటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం

- ఇద్దరు నిందితులు అరెస్ట్, రిమాండ్
- హుజూర్ నగర్ సిఐ గజ్జె చరమంద రాజు



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** మండల పరిధిలోని ఒక గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులు(19) సం॥రాలు కాంపాటి విరామ్ (అలియాస్) రాము, పాముల ఆకాష్ లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చరమంద రాజు తెలిపారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. సిఐ గజ్జె చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం ఘటనపై హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో (గూజూూ) చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ అమానుష ఘటనపై పోలీసులు అత్యంత వేగంగా స్పందించి దర్యాప్తు చేపట్టారు. సమగ్ర విచారణ అనంతరం ఆదివారం నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసిన అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. మహిళలు, మైనర్ బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఇటువంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## ఉకే శీరీష కుటుంబాన్ని పరామర్శించిన ఆదివాసీ నాయకులు



**చంద్రుగొండ, సెప్టెంబర్ 6 (జనం సాక్షి) :** ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఆదివాసీ యువతి కీ.శే. ఊకే శీరీష కుటుంబాన్ని చంద్రుగొండ మండల ఆదివాసీ నాయకులు ఆదివారం పరామర్శించారు. శీరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తమ వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. శీరీష మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు చంద్రుగొండ మండల ఆదివాసీలు అండగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం శీరీష కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, సీనియర్ ఆదివాసీ నాయకుడు కారం వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, సీనియర్ నాయకుడు మల్లం కృష్ణయ్య, యేప మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు సిరులు

- రైతు సంక్షేమానికి మంత్రి తుమ్మల కృషి
- ఎమ్మెల్యే జారే

**అశ్వరావుపేట సెప్టెంబర్ 6 (జనంసాక్షి) :** ఆయిల్‌పామ్ సాగును రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించి రైతులకు అధిక ఆదాయం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నారంవారిగూడెం తెలంగాణ ఆయిల్ ఫెడ్ రీజినల్ కార్యాలయం ఆయిల్‌పామ్ మొక్కల తయారీ నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీతో పాటు బిందు సేద్యం కోసం రాయితీలు ఎరువులు సస్యరక్షణ చర్యలకు ప్రోత్సాహకాలు వంటి అనేక సౌకర్యాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మరింతగా వచ్చేలా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని వివరించారు ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే పంటగా మారుతోందని పేర్కొన్నారు రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడంతో పాటు సాగులో అవసరమైన సాంకేతిక సహకారం ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందించి ఆయిల్‌పామ్ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల్‌పామ్ గెలల ధర గణనీయంగా పెరిగిందని తెలిపారు ధరలో తగ్గుదల లేకుండా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర రూ 24 వేలకుపైగా పలుకుతోందని చెప్పారు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగానే ఆయిల్‌పామ్ రైతుల్లో నమ్మకం పెరిగిందని పేర్కొన్నారు

ఆయిల్‌పామ్ రైతులకు ఇంతటి మంచి ధర లభించేందుకు కృషి చేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు రైతుల పక్షాన నిలబడి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. రైతులకు ఆదాయం పెంచే పంటలను ప్రోత్సహిస్తూ సాగుకు అవసరమైన రాయితీలు ఎరువులు బిందు సేద్యం సస్యరక్షణ చర్యలు, ఇతర




సౌకర్యాలను అందించడం ద్వారా ఆయిల్‌పామ్ సాగును మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు ఆయిల్‌పామ్ సాగుతో రైతుల జీవితాల్లో సిరులు కురుస్తున్నాయని ఆయన అన్నారు

ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, రావు గంగాధర్ రావు, మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# వచ్చే జూన్ కల్లా సెన్సెక్స్ 89,000 పాయింట్లకు

## మోర్గాన్ స్టాన్లీ అంచనా



2027 జూన్ నాటికి బీఎస్ఈ సెన్సెక్స్ 89,000 పాయింట్లకు చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి ఇది 16 శాతం అధికం. 'ఏ లాంగ్ వే అప్' పేరుతో విడుదల చేసిన నివేదికలో భారత్ సుదీర్ఘ కాల వృద్ధి చక్రంలోకి ప్రవేశిస్తోందని వ్యూహకర్తలు రిధమ్ దేశాయ్, నయంత్ పరేఖ్ పేర్కొన్నారు. ఇటీవలి మార్కెట్ ఒడుదొడుకులను వారు ఒక తాత్కాలిక విరామంగానే భావిస్తున్నారు. అయితే ఈ మార్కెట్ లక్ష్యాలు ముడి చమురు ధరలు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని వారు తెలిపారు. 2027 జూన్ నాటికి మార్కెట్ పరిస్థితి బుల్ కేసులో ఉంటే గరిష్ఠంగా సెన్సెక్స్ 1,00,000 పాయింట్లకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి ముడి చమురు ధర బ్యారెల్‌కు 75-80 డాలర్ల కంటే తక్కువగా ఉండాలి. కంపెనీల ఆదాయాలు ఏటా 19 శాతం వృద్ధి చెందాలి. బేస్ కేసులో (సాధారణ వృద్ధి) 89,000 పాయింట్లకు చేరొచ్చు. దీనికి ఆర్థిక స్థిరత్వం కొనసాగాలి. ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి. కంపెనీల ఆదాయాలు ఏటా 16 శాతం వృద్ధి చెందాలి.

బేర్ కేసులో (మార్కెట్ పతనం) సెన్సెక్స్ 66,000 పాయింట్లకు పడిపోయే అవకాశం ఉంది. ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లను అధిగమించడం, అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, కంపెనీల ఆదాయాల వృద్ధి 13 శాతానికి పడిపోవడం వంటివి పతనానికి కారణాలు కావొచ్చు.

లాభపడే రంగాలుదేశంలో రుణాలు, పెట్టుబడులకు గిరాకీ పెరగడం వల్ల బ్యాంకింగ్ రంగం బాగా లాభపడుతుంది. ప్రభుత్వ మౌలిక సదుపాయాల వ్యయం, ప్రైవేటు కంపెనీల పెట్టుబడుల వల్ల పారిశ్రామిక రంగం పుంజుకుంటుంది. దేశీయంగా కొనుగోలు శక్తి, పట్టణ వినియోగం పెరగడంతో వినియోగ రంగం జోరందుకుంటుంది. అంతర్జాతీయంగా ఐటీ మందగమనం ఉన్నప్పటికీ, కృత్రిమ మేధ (ఏఐ) అప్లికేషన్ల గిరాకీ వల్ల ఇది ఊహించని విధంగా పుంజుకునే అవకాశం ఉంది.

**గమనించాల్సిన నష్ట భయాలు**

యుద్ధాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అడ్డంకులు మార్కెట్‌ను దెబ్బతీయొచ్చు. భారత్ ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటుంది కాబట్టి ధరలు పెరిగితే కంపెనీల లాభాలు తగ్గుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను తగ్గించకపోతే మార్కెట్ వృద్ధి మందగించొచ్చు.

## ఏకే-203 రైఫిళ్లకు మందుగుండు సామగ్రి సరఫరా

### 5 ఏళ్ల ఒప్పందంపై అదానీ డిఫెన్స్ సంతకం

దిల్లీ: మనదేశంలో తయారవుతున్న ఏకే-203 అసాల్ట్ రైఫిళ్లకు స్వదేశీ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన 7.62/39 ఎంఎం మందుగుండు సామగ్రిని సరఫరా చేయడానికి ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అయిదేళ్ల ఒప్పందంపై అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంతకం చేసింది. ఒప్పందం ప్రకారం, ఏకే-203 కార్యక్రమానికి అవసరమైన చిన్న క్యాలిబర్ మందుగుండు సామగ్రిని అదానీ డిఫెన్స్ అయిదేళ్ల పాటు నిరంతరాయంగా సరఫరా చేయనుంది. ఈ ఒప్పందం ఇండో-రష్యన్ రైఫిల్స్ (ఐఆర్‌ఆర్‌పీఎల్) ద్వారా రైఫిల్ తయారీని, అదానీ డిఫెన్స్ ద్వారా మందుగుండు సామగ్రి తయారీని ఏకం చేస్తూ, భారతదేశ రక్షణ తయారీ వ్యవస్థలో ఏకే-203 కార్యక్రమానికి సంబంధించిన ఈ రెండు విభాగాలను అనుసంధానిస్తుంది. భారత సాయుధ దళాల కోసం ఏకే-203 రైఫిళ్లను తయారు చేయడానికి, భారత్-రష్యా అంతర్ ప్రభుత్వ ఒప్పందం కింద 2019లో ఐఆర్‌ఆర్‌పీఎల్‌ను స్థాపించారు. దీని తయారీ కేంద్రం ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ జిల్లాలో ఉన్న కోర్వా వద్ద ఉంది. ఈ సంయుక్త సంస్థ(జేవీ)లో భారతీయ వాటాదార్లుగా అడ్వాన్స్‌డ్ వెపన్స్ అండ్ ఎక్విప్‌మెంట్ ఇండియా లిమిటెడ్, మునిషన్స్ ఇండియా లిమిటెడ్ ఉండగా, రష్యా వాటాదార్లుగా కన్సర్న్ కలాష్నికోవ్, రోసోబోరోనెక్స్‌పోర్ట్ ఉన్నాయి.



## ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!

ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన సేవలను మరింత విస్తరించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేల నియామకాలతో పాటు కొత్తగా 250 బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ ఏడాదే 11-12 వేల వరకు కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళికలు ఉన్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు. ముఖ్యంగా క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఇవి ఉంటాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్, బ్యాంక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐకి అత్యంత భారీ నెట్‌వర్క్ ఉందని, బ్యాంక్ సేవలను మరింత విస్తరించేందుకు కొత్తగా 200 - 250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మార్చి 2026 నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలు దాటింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంక్ మొత్తం 25,633 మందిని రిక్రూట్ చేసుకుంది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతిపాదిస్తున్న రూ.30వేల కోట్ల ఐపీఓలో ఎస్‌బీఐ, దాని అనుబంధ సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ సంయుక్తంగా 1 శాతం వాటాను విక్రయించనున్నాయి.

**జేఎల్ఆర్‌లో 4,000 ఉద్యోగాల కోత**

లండన్: టాటా మోటార్స్ అనుబంధ లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) యూకేలోని తన విభాగాల్లో వచ్చే రెండేళ్లలో సుమారు 4,000 మంది ఉద్యోగులను తగ్గించాలని యోచిస్తోంది. అంతర్జాతీయంగా తగ్గుతున్న అమ్మకాలు, పెరుగుతున్న ఖర్చులు, అమెరికా విధిస్తున్న కొత్త వాణిజ్య సుంకాల ప్రభావం వల్ల ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని సమాచారం. ఖర్చులను తగ్గించుకుని సంస్థను మరింత సమర్థవంతంగా నడపంలో భాగంగా ఉద్యోగుల కోసం కంపెనీ స్వచ్ఛంద విరమణ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. జేఎల్ఆర్ ఉద్యోగాల కోత ద్వారా వచ్చే రెండేళ్లలో సుమారు 1.7 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.17,000 కోట్లకు పైగా) వ్యయాలను తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం జేఎల్ఆర్‌కు బ్రిటన్ వ్యాప్తంగా మూడు ప్రధాన ప్లాంట్లలో సుమారు 34,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజా ఉద్యోగాల కోత ఆఫీస్, మేనేజ్‌మెంట్ సిబ్బందికే వర్తించనుందని తెలుస్తోంది. జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్ మన దేశంలో వచ్చే రెండేళ్లలో 12 శాతం మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది.

## 11 కంపెనీలు.. రూ.7,055 కోట్లు..

### ఈ వారం ఐపీఓలు ఇవే

ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించనున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్‌లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్‌తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే.. ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది. కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632. ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు. గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది. రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి. కరమ్‌తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది. మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది. స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి ఇంకా వెల్లడించలేదు.

వీగాలాండ్ డెవలపర్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబర్ 10న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 15న సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40

వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,60,754 (22 క్యారెట్లు)

₹ 1,75,370 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,50,000

# 'పసిడి' రుణాల పైపైకి..

## 2028 నాటికి రూ.30 లక్షల కోట్లకు



హైదరాబాద్: దేశ వ్యాప్తంగా బంగారు రుణాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో చివరి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఈ రుణాలు, ఇప్పుడు రిటెయిల్ ఆస్తుల విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ నివేదిక అంచనా ప్రకారం.. 28 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఈ రంగం 2028 మార్చి నాటికి రూ.30 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుంది. 2026 మార్చి నాటికి రూ.18.6 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిణామం, గృహ రుణాల తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తూ, రెండో అతిపెద్ద రిటెయిల్ ఆస్తి విభాగంగా నిలిచింది. వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియోనూ ఇది అధిగమించడం విశేషం. 2026 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 50 శాతం వృద్ధికి పసిడి ధరలు 60 శాతం మేర పెరగడమూ ప్రధాన కారణం. భారతీయ కుటుంబాల దగ్గరున్న బంగారు నిల్వలే ఈ భారీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి.

**ఇళ్లల్లోనే 28,000 టన్నుల పసిడి**

ఇళ్లల్లో ఉన్న పసిడి నిల్వలు దేశ రుణ లభ్యతను పెంచే వ్యూహాత్మక వనరులుగా మారుతున్నాయి. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 28,000 టన్నుల బంగారం ఉన్నట్లు అంచనా. దీని విలువ రూ.380-390 లక్షల కోట్ల మధ్య ఉంటుంది. ఈ భారీ నిల్వలో కేవలం 8 శాతం మాత్రమే వ్యవస్థీకృత మార్కెట్ పరిధిలోకి రావడం గమనార్హం. ఇదీ ఈ రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను చాటుతోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ సంస్థలు, అసంఘటిత రంగాలు తమ నిర్వహణ మూలధనం కోసం పసిడి రుణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. మైక్రోఫైనాన్స్ వినియోగదారులు పొందే ఇతర రిటెయిల్ రుణాల్లో బంగారు రుణాల వాటా 18 శాతానికి చేరడం గమనార్హం.

**పాత రుణగ్రహీతలే ఎక్కువగా..**

బంగారం రుణాల్లో మరో ఆసక్తికరమైన విషయమూ ఉంది. కొత్త రుణగ్రహీతలకంటే, పాత ఖాతాదారులే పదే పదే రుణాలు తీసుకోవడం మార్కెట్ సుస్థిరతపై సందేహాలను రేకెత్తిస్తోంది. ప్రస్తుత వృద్ధి కేవలం బంగారం ధరల పెరుగుదలపైనే ఆధారపడి ఉంటుంది తప్ప వినియోగదారుల సంఖ్యలో పురోగతి కనిపించడం లేదు. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ వంటి బంగారు రుణ సంస్థలూ ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయి. ఈ రెండు సంస్థల ఉమ్మడి ఖాతాదారుల సంఖ్య 90 లక్షల వద్ద, బంగారం నిల్వలు 260-265 టన్నుల వద్దే ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో విలువ పెరిగినా, వినియోగదారుల బలం విస్తరించకపోవడం పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు. 2022లో 75 శాతంగా ఉన్న పాత రుణాల పునరుద్ధరణ వాటా 2025 నాటికి 82 శాతానికి చేరడం వ్యవస్థాగత నష్టభయాన్ని సూచిస్తోంది. ఇది రుణ గ్రహీతలు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదాన్ని వెల్లడిస్తోంది.

**దేశవ్యాప్తంగా...**

ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలకే ఎక్కువగా పరిమితమైన బంగారు రుణాల వ్యాపారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తోంది. దేశవ్యాప్త సగటు వృద్ధి 50 శాతంగా ఉంటే, రాజస్థాన్‌లో 78 శాతం, మహారాష్ట్రలో 61 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం వృద్ధి నమోదైంది. ఈ భౌగోళిక విస్తరణ పసిడి రుణ రంగంలో సరికొత్త పోటీకి ఆస్కారం ఇస్తోంది..

**నిబంధనలు కఠినంగా..**

పసిడి రుణ మార్కెట్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని గమనిస్తున్న నియంత్రణ సంస్థలు నిబంధనలను ఎప్పటికప్పుడు కఠినతరం చేస్తున్నాయి. మార్కెట్ అదుపు తప్పకుండా చూసేందుకు ఆర్‌బీఐ పర్యవేక్షణ పెంచింది. ఎల్‌టీవీ లెక్కింపు విధానం, రుణాల కాలపరిమితి, రుణ గ్రహీతల అర్హత ప్రమాణాలతో పాటు రుణ నిర్వహణ పైనా కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య నిబంధనల సమన్వయం వల్ల అనారోగ్యకరమైన పోటీకి అడ్డుకట్ట వేయాలని ఆర్‌బీఐ భావిస్తోంది.

**పోటీ పడుతున్న సంస్థలు**

ఈ రంగంలోని లాభాలను అందుకోవడానికి ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) సంస్థలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ బంగారం రుణాల విభాగం గత మూడేళ్లలో 86 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేస్తూ, 2026 జూన్ త్రైమాసికం నాటికి రూ.21,000 కోట్లకు చేరింది. 2027 మార్చి నాటికి రూ.30,000 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఆ సంస్థ భావిస్తోంది. ఈ తీవ్ర పోటీ వల్ల కేవలం పసిడి రుణాలపైనే దృష్టి సారించే సంస్థలపై ఒత్తిడి పెరుగుతోంది

# టాటా సన్స్ ఛైర్మన్ రేసులో అనూహ్యంగా ఆశిష్ చౌహాన్

- అంతర్గత అభ్యర్థుల్లో టీవీ నరేంద్రన్ ముందంజ
- సీఎఫ్ఓ సౌరభ్ అగర్వాల్ సహా మరి కొందరి పేర్లు కూడా





టాటా సన్స్ తన ప్రస్తుత ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ స్థానంలో కొత్త ఛైర్మన్‌ను ఎంపిక చేసే ప్రక్రియను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ పదవీకాలం ఫిబ్రవరి 20, 2027తో ముగియనున్న సంగతి తెలిసిందే. కొత్త ఛైర్మన్ రేసులో ప్రముఖంగా ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు టాటా స్టీల్ సీఈఓ, ఎండీ టీవీ నరేంద్రన్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అనుకుంటుండగా.. టాటా గ్రూప్ సీఎఫ్ఓ సౌరభ్ అగర్వాల్‌తో పాటు అనూహ్యంగా ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ చౌహాన్ పేరు తెర పైకి రావడం గమనార్హం. అయితే టీవీ నరేంద్రన్, సౌరభ్ అగర్వాల్ టాటా గ్రూపునకు చెందిన వాళ్లు కాగా.. ఆశిష్ చౌహాన్ బయటి వ్యక్తి. మరి కొత్త ఛైర్మన్ సీటులో ఎవరు కూర్చోబోతున్నారు.. ఇంటి వ్యక్తా? బయటి వ్యక్తా?.

టీవీ.నరేంద్రన్: ప్రస్తుతం టాటా స్టీల్‌కు సీఈఓ, ఎండీగా వ్యవహరిస్తున్నారు. అంతర్గత అభ్యర్థి కావడంతో టాటా సన్స్ కొత్త ఛైర్మన్ రేసులో ఈయన ముందంజలో ఉన్నట్లు కనిపిస్తోంది. టాటా గ్రూపులో 3 దశాబ్దాలుగా అనుభవం ఉండటం, టాటా స్టీల్‌ను విజయవంతంగా నడిపించిన దక్షత, నోయల్ టాటా నమ్మకస్తుల్లో ఒకరు కావడం ఆయనకు కలిసిరానుంది.

ప్రతికూలతలు: ఉద్యోగ జీవితంలో ఎక్కువ భాగం టాటా స్టీల్‌కే పరిమితం కావడం; గ్రూపు స్థాయిలో మూలధన కేటాయింపులు, ఇతర రంగాల నిర్వహణలో పరిమిత అనుభవం.

ఆశిష్ చౌహాన్: ప్రస్తుతం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీకి (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఐఐటీ బాంబే పూర్వ విద్యార్థి అయిన ఈయనకు బీఎస్ఈ మాజీ సీఈఓగా పనిచేసిన అనుభవమూ ఉంది. మార్కెట్, టెక్నాలజీ, రెగ్యులేటరీ వ్యవహారాల్లో నిపుణుడు. సంక్షోభ నిర్వహణ (ట్రబుల్ షూటర్), సాంకేతిక మార్పులు, ప్రభుత్వ నిబంధనలపై పట్టు ఉంది.

ప్రతికూలత: టాటా గ్రూపు బయట వ్యక్తి కావడం. క్యాపిటల్ మార్కెట్‌కే పరిమితం కావడంతో 30కి పైగా రంగాలున్న టాటా గ్రూపు సంస్థను నడిపించగలరా అనే సందేహాలు.

సౌరభ్ అగర్వాల్: ప్రస్తుతం టాటా గ్రూపునకు సీఎఫ్ఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా ఉన్నారు. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో అపార అనుభవం ఉంది. మూలధన కేటాయింపులు, ఆర్థిక నిర్వహణలో దిట్ట. టాటా కేపిటల్, టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ సహా పలు టాటా గ్రూపు కంపెనీలకు ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

ప్రతికూలత: పారిశ్రామిక తయారీ రంగాల ప్రత్యక్ష నిర్వహణ అనుభవం లేకపోవడం.

వీరు కాకుండా టాటా సన్స్ చీఫ్ డిజిటల్ అధికారి ఆర్తి సుబ్రమణియన్, టాటా మోటార్స్ సీఈఓ శైలేష్ చంద్ర, టాటా పవర్ సీఈఓ ప్రవీర్ సిన్హా పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. అయితే ఒకవేళ కొత్త ఛైర్మన్ నియామక నిర్ణయం ఆలస్యమైతే తాత్కాలిక ఛైర్మన్‌గా నోయల్ టాటా బాధ్యతలు చేపట్టే అవకాశాలు లేకపోలేదు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా ఉన్న నోయల్ టాటా ప్రస్తుతం టాటా సన్స్ ఛైర్మన్ ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే.

## ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఎల్ఐసీ భారీ పెట్టుబడులు

### 9.99% వాటా కొనుగోలుకు ఆర్‌బీఐ అనుమతి



హైదరాబాద్: ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో పెద్ద ఎత్తున వాటాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సిద్ధమవుతోంది. బ్యాంకులో గరిష్ఠంగా 9.99 శాతం వరకూ సొంతం చేసుకునేందుకు ఎల్ఐసీకి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతినిచ్చింది. ఈ వివరాలను బ్యాంకు శనివారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. నిబంధనల ప్రకారం సెప్టెంబరు 4, 2027 నాటికి ఎల్ఐసీ ఈ వాటా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ గడువులోగా వాటాలను కొనకపోతే, ఆర్‌బీఐ ఇచ్చిన ఈ అనుమతి రద్దవుతుందని ఐసీఐసీఐ బ్యాంక్ స్పష్టం చేసింది. ఈ వాటా కొనుగోలు వ్యవహారమంతా చట్టబద్ధమైన, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని పేర్కొంది. గత నెలలోనే ప్రైవేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లోనూ గరిష్ఠంగా 9.99 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఎల్ఐసీకి ఆర్‌బీఐ నుంచి అనుమతి లభించింది. సాఫ్ట్‌వేర్ షేర్లలో భారీ లాభాలు పొందిన కొద్ది రోజుల్లోనే ఎల్ఐసీకి ఆర్‌బీఐ నుంచి ఈ కొత్త అనుమతి రావడం గమనార్హం. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల దేశీయ ఐటీ రంగానికి సవాళ్లు ఎదురవుతాయనే ఆందోళనల మధ్య ఎల్ఐసీ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. దేశీయ సాఫ్ట్‌వేర్ ఎగుమతి సంస్థలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లలో పెట్టుబడులు పెట్టి కేవలం 35 రోజుల్లోనే రూ.21,000 కోట్ల కంటే ఎక్కువ లాభాన్ని ఆర్జించింది. తొలి త్రైమాసికం ముగిసేనాటికి ఈ మూడు ఐటీ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల మార్కెట్ విలువ రూ.1.05 లక్షల కోట్లు కాగా, ఆగస్టు 4 నాటికి అది రూ.1.26 లక్షల కోట్లకు చేరింది. ఈ లాభాల జోరు మీదున్న బీమా సంస్థ, ఇప్పుడు ఐసీఐసీఐ బ్యాంక్‌లోనూ వాటాలను పెంచుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి సాధించింది.

## డ్రగ్స్ కేసు.. మహిళా టీవీ యాంకర్‌కు మరణశిక్ష

మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఈజిప్టుకు చెందిన న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. స్థానిక టీవీ వ్యాఖ్యాత సారా ఖలీఫా (39) సహా 12 మందికి మరణశిక్ష విధించింది. మరో తొమ్మిది మంది దోషులకు జీవిత ఖైదు విధించగా.. ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. నిందితులు విదేశాల నుంచి ముడిపదార్థాలను దిగుమతి చేసుకోవడం, స్థానికంగా సింథటిక్ డ్రగ్స్ తయారు చేయడం, వాటిని విక్రయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. గతేడాది దాడుల్లో 750 కిలోలకుపైగా మాదక ద్రవ్యాలు, ముడి పదార్థాలు, లైసెన్స్ లేని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా గతేడాది ఏప్రిల్‌లోనే సారాను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. తాను ఎన్నడూ డ్రగ్స్ వాడలేదని, కనీసం సిగరెట్ కూడా తాగలేదని విచారణ సందర్భంగా కోర్టులో విలపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. తాజాగా మరణశిక్ష పడడంతో.. తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ఆమె తరఫు న్యాయవాది వెల్లడించారు.

**ఎవరీ సారా..?**

ఈజిప్టుకు చెందిన సారా ఖలీఫా స్థానికంగా టెలివిజన్ ప్రజెంటర్‌గా గుర్తింపు పొందారు. నేరాలు, భద్రత సంబంధిత అంశాలతో కూడిన 'మిషన్ ఇంపాజిబుల్' అనే కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. కాస్మెటిక్ సర్జరీ క్లినిక్‌తోపాటు ఈవెంట్‌లు, పార్టీలు నిర్వహించే ప్రొడక్షన్ కంపెనీ కూడా ఉన్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో క్రియాశీలంగా ఉండే ఆమెకు ఇన్‌స్టాలో 25లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు.

**మిస్ వరల్డ్‌గా డొమినికన్ రిపబ్లిక్ భామ**

ఈజిప్టులో ఉగ్రవాదం, హత్య, అత్యాచారం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి నేరాల్లో మరణశిక్ష అమలు అవుతోంది. అయితే, డ్రగ్స్ కేసుల్లో మరణదండన విధించడాన్ని అక్కడి మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇదిలాఉంటే, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం.. 2025లోనే ఈజిప్టు 492 మరణశిక్షలు విధించగా, వాటిలో 23 అమలు చేసింది.

# వినాయక నిమజ్జనానికి ఎంఎంసీ సన్నద్ధం

- 40 కేంద్రాలు.. 84 క్రేన్లు.. 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బంది
- 24 గంటల విద్యుత్, వైద్య, రక్షణ సేవలు






**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలను సురక్షితంగా, పర్యావరణ హితంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. మూడు జోన్లలో 40 నిమజ్జన కేంద్రాలు, 84 క్రేన్లు, 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బందితో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్ జోన్ల పరిధిలో మొత్తం 40 నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 18 చెరువులు, 7 కుంటలు/బేబీ పాండ్లు, 15 కృత్రిమ చెరువులు, పోర్టబుల్ ట్యాంకులు ఉన్నాయి. ప్రజల సౌకర్యార్థం ప్రధాన చెరువులతో పాటు పార్కులు, క్రీడా మైదానాలు, మార్కెట్ యార్డుల్లోనూ కృత్రిమ నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాల్లో ఫోకస్ లైట్లు, తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాడే విద్యుత్ తీగలను తొలగించనున్నారు. చెట్ల కొమ్మల కత్తిరింపు, రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, ఫుట్‌పాత్‌ల రంగుల పనులు చేపడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వల్ చర్యలు నిర్వహించను న్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం 168 గణేష్ యాక్షన్ టీమ్‌లను (జీఏటీ) 56 ఊరేగింపు మార్గాల్లో మోహరించనున్నారు. మూడు షిఫ్టుల్లో 1,356 మంది పారిశుద్ధ్య కార్మికులు 24 గంటల పాటు విధులు నిర్వర్తించనున్నారు. చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపును నిరంతరాయంగా చేపట్టనున్నారు. ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద 84 స్టాటిక్, మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నారు.

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, ఈతగాళ్లు, పడవలు, లైఫ్ సేవింగ్ పరికరాలను అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయక చర్యలు చేపట్టనున్నారు. ప్రజల సౌకర్యార్థం 62 మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయనున్నారు. క్రేన్ ఆపరేటర్లు, సిబ్బందికి విశ్రాంతి గదులు, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు పేర్కొన్నారు.



## మదీనాగూడలో 100 పడకల
# మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రి

- ప్రణామ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నూతన ఆసుపత్రి ప్రారంభం
- మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు
- అందుబాటు ధరల్లో వైద్య సేవలే లక్ష్యం: డాక్టర్ మనీష్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మియాపూర్ మదీనాగూడలో ప్రణామ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన 100 పడకల 'మదర్ అండ్ చైల్డ్' ఆసుపత్రిని రాష్ట్ర ప్రజాబద్ధుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ నేత రవికుమార్‌యాదవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ మాట్లాడుతూ డాక్టర్ మనీష్ బృందం మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, 100 పడకల సామర్థ్యంతో ఆసుపత్రిని అన్ని హంగులతో తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ప్రణామ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ గౌర్, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రజ్ఞా శ్రీవాస్తవ మాట్లాడుతూ ఇప్పటికే 150 పడకల మల్టీ స్పెషాలిటీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవల కోసం నూతన భవనాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఐసీయూలు, ఎన్‌ఐసీయూ, పీఐసీయూ, మెటర్నల్ ఐసీయూతోపాటు లగ్జరీ సూట్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సాధారణ ప్రజలకు అందుబాటు ధరల్లో, కుటుంబ వైద్యుడిలా ఆత్మీయ భరోసా కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ ప్రసాద్, మనోజ్, సీఓఓ గీతాభవాని, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో శ్రీజ, రవివర్మ సత్తా

**మహిళల విభాగంలో 65 కిలోలు ఎత్తిన శ్రీజ.. పురుషుల విభాగంలో 185 కిలోలతో రవివర్మ ప్రథమ స్థానం**

**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ, ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏరియా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వెయిట్ లిఫ్టింగ్ మహిళల విభాగంలో శ్రీజ 65 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో రవివర్మ 185 కిలోల బరువు ఎత్తి విజేతగా నిలిచారు. విజేతలను నిర్వాహకులు, తోటి క్రీడాకారులు అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ అక్రమ్ పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొనేలా నిర్వాహకులు ప్రోత్సహించారు.

## పురావస్తు అనుమతులు రాగానే
# యోగా నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం

- కేంద్ర అనుమతుల కోసం ఎదురుచూపులు
- ఉగ్ర నరసింహస్వామి ఆలయ పనులు పుష్కరాల్లోపు పూర్తి
- సోమవారం తెల్లవారుజామున 2.48 గంటలకు భూమిపూజ : మంత్రి లక్ష్మణ్‌కుమార్



**ధర్మపురి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** ధర్మపురి క్షేత్రంలోని శ్రీ యోగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కేంద్ర పురావస్తు శాఖ అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, సోమవారం తెల్లవారుజామున నిర్వహించనున్న భూమిపూజ ఏర్పాట్లను పరిశీలించారు. ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ భూమిపూజకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను గోదావరి పుష్కరాల్లోపు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. యోగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పురావస్తు శాఖ కేంద్రం పరిధిలో ఉన్నందున అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 2.48 గంటలకు జరిగే భూమిపూజకు ధర్మపురి నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, వేముల రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 9న "డిమాండ్స్ డే"ను విజయవంతం చేయాలి

**మేడ్చల్ జిల్లా యంగ్ వర్కర్స్ కన్వీనర్ కె.ఎస్.ఎస్.మణికంఠ**

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- పీఎఫ్,హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** సీఐటీయూ అనుబంధ యంగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న నిర్వహించే "డిమాండ్స్ డే" కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంగ్ వర్కర్ కన్వీనర్ కె.ఎస్.ఎస్.మణికంఠ పిలుపునిచ్చారు. ఆదివారం చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సీఐటీయూ కార్యాలయంలో కె.ఎస్.ఎస్.మణికంఠ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యువ కార్మికుల సమస్యలు, ఉపాధి అవకాశాల పెంపు, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాల విస్తరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా అమలు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు పీఎఫ్ వర్తింపజేయాలని కోరారు. యువ కార్మికులకు సమాన హక్కులు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సెప్టెంబర్ 9న నిర్వహించే "డిమాండ్స్ డే" కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు యువ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చర్లపల్లి యంగ్ వర్కర్ స్టీరింగ్ కమిటీ సభ్యులు సి.హెచ్.పెద్దిరెడ్డి, జె.మహేశ్వర్, కమిటీ సభ్యులు, యువ కార్మికులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

***అన్ని రంగాల్లో మహిళలు ముందుకు రావాలి: ఎమ్మెల్యే రాగమయి***

- జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కేంద్రం ప్రారంభం
- మహిళా సంఘాల సభ్యులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**పెనుబల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పెనుబల్లి మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ఎస్‌బీఐ, ఆర్‌ఎస్‌ఈటీఐ ఖమ్మం, ఉషాకిరణాల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా సంఘాల ద్వారా సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, పెట్రోల్ బంకుల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. జ్యూట్ బ్యాగుల తయారీ వంటి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమై కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆశయం నెరవేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అక్రమంగా గోవుల తరలింపు

- అక్రమ పశు రవాణకు అడ్డాగా రాజపురం.. పట్టించుకోని పోలీసు శాఖ
- రాత్రివేళల్లో వాహనాల ద్వారా పశువుల తరలింపుపై గ్రామస్థుల ఆందోళన
- అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పోలీసులను కోరుతున్న ప్రజలు

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 6, జనం సాక్షి :** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో అర్ధరాత్రి వేళల్లో గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. రాత్రి సమయాల్లో అనుమానాస్పద వాహనాల్లో పశువులను తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాజపురం గ్రామంలో ఎక్కువ మంది అక్రమ పశు రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.ప్రత్యేకంగా పశువులను తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేసుకొని అర్ధరాత్రి సమయంలో వేరు వేరు మండలాల నుండి సూర్యాపేట సంత నుంచి కాలేబాలు తరలిస్తున్నారు. గతంలో అనేక సార్లు పశు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి గోవులను పాల్వంచ గోశాలకు తరలించిన సంఘటనలు ఎన్నో వున్నాయి. ఐన వారు అక్రమ పశు రవాణా ఆగడం లేదు. వాహనాలు అతివేగంగా నడుపుతూ రాత్రులు సమయంలో పల్లెల్లో వాహనాలు దూసుకుపోతున్నాయి.పశు అక్రమ వ్యవహారంపై పలుమార్లు పట్టుబడిన మాకు ఏమి కాదు అన్నట్లుగా వ్యవహరిస్తూ అక్రమ రవాణా చేస్తున్నారు కొంత మంది వ్యాపారులు.ఈ అక్రమ రవాణా అడ్డుకునేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పశువుల తరలింపునకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రివేళల్లో ప్రధాన రహదారులు, గ్రామీణ మార్గాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా పోలీసు శాఖ స్పందించి పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నల్గొండ విద్యా రంగానికి గర్వకారణం




**నల్గొండ ప్రతినిధి,సెప్టెంబర్ 5,(జనం సాక్షి):** విద్యా బోధన,పరిశోధన, సమాజ సేవలో విశిష్ట సేవలు అందిస్తున్న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. వై. ప్రశాంతి 2026 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విద్యావర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రామన్న పేటలో పాఠశాల విద్య పూర్తి చేసిన ఆమె నల్గొండ నాగార్జున ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.హైదరాబాద్‌లోని IICTలో పరిశోధన అనుభవం పొందడంతో పాటు తైవాన్‌లో పోస్ట్‌డాక్టోరల్ పరిశోధన చేశారు. బోధనతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు చేస్తూ పలు పురస్కారాలు అందు కున్నారు. విశ్వవిద్యాలయంలో CDC, UGC కోఆర్డినేటర్, HoD, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ తదితర బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం డైరెక్టర్ అకడమిక్ ఆడిట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తల్లిదండ్ర ులు, భర్త పుట్ట వెంకట రమణారెడ్డి, కుమారుడు, గురువులు, సహచరులు, విద్యార్థుల ప్రోత్సాహమే తన విజయానికి కారణమని డా. ప్రశాంతి తెలిపారు. విద్య, పరిశోధన, సమాజ సేవ ద్వారా దేశానికి ఒక సైనికురాలిలా నిబద్ధతతో పనిచేయడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.ఈ పురస్కారం నల్గొండ జిల్లా విద్యా రంగానికి, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పలువురు అభినందనలు తెలిపారు.

## విలువిద్యలో జాతీయ రికార్డు..

**పసిడి పతకంతో గన్నేరువరం కీర్తిని చాటిన హరిని**

**గన్నేరువరం,(జనంసాక్షి):** కఠిన సాధన, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా శిఖరాగ్రానికి చేరుకోవచ్చని జంగపల్లి గ్రామానికి చెందిన తాడూరి హరిని నిరూపించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక జూనియర్ నేషనల్ ఆర్చరీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం జంగపల్లికి చెందిన తాడూరి రవిచందర్‌రెడ్డి--సునీత దంపతుల ఇద్దరు కుమార్తెలు ఆర్చరీలో రాణిస్తున్నారు. వారిలో పెద్ద కుమార్తె హరిని చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి గ్రామానికి, మండలానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకొచ్చింది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ కుమార్తెలను ఆర్చరీలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రుల సంకల్పం ఆదర్శంగా నిలుస్తోంది. హరిని భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించి మరిన్ని విజయాలు సాధించాలని గ్రామస్థులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# కేసీఆర్ హయాంలో అభివృద్ధి.. కాంగ్రెస్ పాలనలో పల్లెల విధ్వంసం

- గట్టేపల్లిలో బీఆర్ఎస్ 'పల్లెల విధ్వంసం' కార్యక్రమం
- అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- హామీలు ఇచ్చి మరిచిపోవడం కాంగ్రెస్ నైజం:
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం



**ధారూర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కేసీఆర్ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో విధ్వంసం కనిపిస్తోందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్లెల విధ్వంసం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ధారూర్ మండలం గట్టేపల్లిలో ఆయన పర్యటించారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠధామం తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ ప్రభుత్వం పనిచేసింద న్నారు. వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పార్కులు, పల్లె ప్రకృతి వనాలతో గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ వెనుకాడదని, గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాములు, సర్పంచ్ లక్ష్మీవెంకటయ్య, ఉపసర్పంచ్ సరిత పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా పైలట్ రోహిత్‌రెడ్డి

**డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్**

**తాండూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాండూరు పట్టణంలో ఆదివారం భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పాల్గొని స్వయంగా ఆటో నడిపి నిరసన తెలిపారు. ఆటో డ్రైవర్లతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, డ్రైవర్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా తాండూరు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలోనూ రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం, సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆర్యసమాజ్ కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ హోటల్‌లో అమెజాన్ ఉద్యోగి మృతి

ఉప్పల్, (జనంసాక్షి) : ఉప్పల్ పరిధిలోని ఓ హోటల్‌లో అమెజాన్ రవాణా విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న హేమంత్ అనే యువకుడు మృతి చెందాడు. సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన హేమంత్ ఉద్యోగం నిమిత్తం ఉప్పల్‌కు వచ్చి హోటల్‌లో బస చేసిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు హోటల్‌కు చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. హేమంత్ మృతికి గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

***1,216 దరఖాస్తులు.. 1,030 మంది అభ్యర్థుల హాజరు***


- ఐదు సబ్‌డివిజన్లలో పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ రోహిత్‌రాజు
- అర్హులకు రాత, శారీరక దారుఢ్య పరీక్షలపై సమగ్ర శిక్షణ





**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు సాధించాలనుకునే నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,216 మంది దరఖాస్తు చేసుకోగా 1,030 మంది పరీక్షకు హాజరయ్యారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, మణుగూరు, భద్రాచలం సబ్‌డివిజన్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన అర్హులకు కానిస్టేబుల్, ఎస్‌ఐ నియామక పరీక్షలకు అవసరమైన రాత, శారీరక దారుఢ్య పరీక్షలపై సమగ్ర శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో పోలీస్ ఉద్యోగం సాధించవచ్చని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# జైన మతం శాంతి... అహింసకు ప్రతీక - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలి నగర్ కాలనీ పరిధి మంజీర పైప్ లైన్ రోడ్డు నుండి రైల్వే అండర్ పాస్ వెళ్ళే మార్గంలో జైన్ సంఘం తెలంగాణ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబడిన అహింసా స్మారక స్థూపాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలసి కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ వైశాలి నగర్ కాలనీలో జైన్ సంఘం తెలంగాణ మహిళా మోర్చా నేతృత్వంలో నిర్మించబడిన అహింసా స్మారక స్థూపాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషాన్ని అందించిందన్నారు. జైనమతంలో అహింసా చిహ్నం, అరచేతిపై చక్రం ఉన్న చేయి జైనమతంలో అహింసకు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. ఇక మధ్యలో ఉన్న 'అహింస' అన్న పదం ధర్మచక్రాన్ని సూచిస్తుందన్నారు. అరచేతిపై చక్రం కలిగి ఉన్న చేయిని కలిగి ఉండడం ద్వారా ప్రతి నిమిషం జైనులలో అహింసా విధానాన్ని, మానవత్వపు సౌరభాన్ని గుభాళింపచేస్తూ ప్రతి ఒక్కరిని హింసకు దూరంగా ఉండేలా ప్రేరేపిస్తుందన్నారు. మరోవైపు పైకెత్తిన చేయి 'ఆపు' అనే అర్థాన్ని సూచిస్తుందని, ఏపని చేసే ముందైనా ఒక్క క్షణం ఆగి, ఆ పనివల్ల ఇతరులకు ఏమైనా హాని కలుగుతుందా అని ఆలోచించాలని ఇది గుర్తుచేస్తుందని కిషన్ రెడ్డి తదితరులు వివరించారు. అరచేతిలో చక్రం, అరచేతి మధ్యలో ఉన్న చక్రం పరోక్షంగా సంసార చక్రాన్ని, పునర్జన్మల పరంపరను సూచిస్తుందనేది జైనుల ప్రగాఢ విశ్వాసం అని వారు తెలియజేశారు. అహింసను విధానాన్ని జైన పరివారం కఠినంగా పాటించడంద్వారా ఈ సంసార చక్రాన్ని నిలిపివేయవచ్చని ఇది ప్రస్ఫుటం చేస్తుందన్నారు. అరచేతిలోని చక్రాన్ని అనుక్షణం జ్ఞప్తికి తెచ్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ అహింసను అలవర్చుకోవాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని, శాంతి మార్గమే అందరికీ శ్రీరామరక్ష అని వారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, జైన్ సంఘం సభ్యులు శిల్ప జైన్, సందర్భు జైన్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ధాత్రి గౌడ్, అక్తర్, శాస్త్రి మరియు వైశాలినగర్ కాలనీ, సరోవర్ కాలనీ, శారద నగర్ కాలనీ ల ప్రెసిడెంట్ మరియు కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిలికాన్ ఫోటోనిక్స్‌కు తెలంగాణ వ్యూహాత్మక అడుగులు

- 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు రోడ్‌మ్యాప్‌పై చర్చ
- నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్‌తో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ
- సెమీకండక్టర్ మిషన్-2.0తో అనుసంధానానికి అవకాశాల పరిశీలన
- క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం, అడ్వైజరీ కౌన్సిల్‌లో భాగస్వామ్యానికి ఆహ్వానం



**మంథని, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** సిలికాన్ ఫోటోనిక్స్ రంగంలో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్‌తో ఆదివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణతో పాటు ఇండియా సెమీకండక్టర్ మిషన్-2.0తో రాష్ట్ర మిషన్‌ను అనుసంధానించే అవకాశాలను సమీక్షించారు. పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై సమావేశంలో చర్చించారు. డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్, సరఫరా వ్యవస్థలను సమన్వయం చేయడంతోపాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మార్చే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు.
అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి తదుపరి తరం సాంకేతికతల్లో తెలంగాణను ముందంజలో నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

ఇందుకోసం నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని డా. సారస్వత్‌ను ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై ఏర్పాటు చేయనున్న అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కోరారు.

అభివృద్ధి చెందుతున్న ఈ రెండు సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని డా. వీకే సారస్వత్ తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో ఐటీఈసీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేష్ పాల్గొన్నారు.

### మంథని టు ఫాక్స్ కాన్ : ఆడబిడ్డల చేతిలో కొలువు పత్రాలు



మంథని నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల జీవితాల్లో కొత్త వెలుగులు. మారుమూల గ్రామాల నుంచి వచ్చిన యువతులు ఏకంగా ప్రపంచ ప్రఖ్యాత బహుళజాతి సంస్థ ఫాక్స్ కాన్ లో ఉద్యోగాలు సాధించారు. ముత్తారం, రామగిరి, కాటారం, పలిమెల, మహాదేవపూర్, మహాముత్తారం, కమాన్ పూర్, మంథని మండలాలకు చెందిన విద్యార్థినులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇప్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి హైదరాబాద్ లోని ఫాక్స్ కాన్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఎంపికైన విద్యార్థినులకు హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఆత్మవిశ్వాసం, ప్రతి ఆడబిడ్డ జీవితంలో ఆర్థిక స్వావలంబన సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఉద్యోగాలు పొందిన యువతులు, వారి తల్లిదండ్రులు మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మాటలతో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా

- అన్ని రంగాల్లో పెద్దపల్లి ముందంజ
- సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు
- రైతులకు రూ.80.68 కోట్ల సన్నధాన్యం బోనస్
- కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలి: విజయరమణరావు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం పెద్దపల్లిలోని చీకురాయి చౌరస్తా నుంచి జెండా చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ.. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రైతుల నుంచి గింజ కోత లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, సన్నధాన్యానికి రూ.80.68 కోట్ల బోనస్ చెల్లించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. పెద్దపల్లి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. తొలి విడతలో 3 వేల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక చేపడతామని చెప్పారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.88 కోట్లు విడుదల చేయించామని, భూసేకరణకు మరో రూ.80 కోట్లు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు విస్తరించేందుకు రూ.53 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. పెద్దపల్లిలో ఆర్వోబీ పనులు పూర్తిదశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తులపై కాదు.. వ్యవస్థ ఆధారంగా విద్యా వ్యవస్థ

- మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బోధన
- విద్యార్థులకు ఉపాధ్యాయులే ఆదర్శంగా నిలవాలి
- ఉత్తమ సేవలందించిన 58 మంది ఉపాధ్యాయులకు సన్మానం
- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** వ్యక్తులపై ఆధారపడకుండా వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన 58 మంది ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం నాటి విద్యా వ్యవస్థకు, ఆధునిక సాంకేతిక యుగంలోని వ్యవస్థకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. గత రెండున్నరేళ్లుగా జిల్లాలో విద్యా వ్యవస్థను వ్యక్తులపై కాకుండా వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కేవలం ర్యాంకులు, నంబర్లపై కాకుండా బోధనా ప్రక్రియను బలోపేతం చేయడానికే ప్రాధాన్యం ఇచ్చామని, ప్రక్రియ సక్రమంగా ఉంటే ఫలితాలు సహజంగానే వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో డీఈవో జి.శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రమ బాలికకు ఎంబీబీఎస్ సీటు

తబిత ఆశ్రమంలో చిన్ననాటి నుంచి ఉంటూ చదువుకున్న అనాథ బాలిక వి.సంధ్య పట్టుదలతో ఎంబీబీఎస్ సీటు సాధించి స్ఫూర్తిగా నిలిచిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని తబిత ఆశ్రమంలో మొదటి తరగతి నుంచి విద్యాభ్యాసం కొనసాగించిన సంధ్య ఇంటర్మీడియట్‌లో 955 మార్కులు సాధించారు. వైద్య విద్యలో ప్రవేశం పొందాలన్న ఆమె లక్ష్యానికి కలెక్టర్ ప్రత్యేకంగా ప్రోత్సాహం అందించి నీట్ ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయం కల్పించారు. ఆశ్రమంలో ఉంటూనే కోచింగ్ తీసుకున్న సంధ్య పట్టుదలతో చదివి భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమెను అభినందించిన కలెక్టర్.. ఎంబీబీఎస్ విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, సంధ్యను ఆదర్శంగా తీసుకుని ఆశ్రమంలోని ఇతర బాలబాలికలు విద్యలో రాణించాలని సూచించారు.

# పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

### అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శీరిష కృష్ణారెడ్డి



**శామీర్ పేట, సెప్టెంబర్ 6(జనం సాక్షి) :** అలియాబాద్ మున్సిపాలిటీలో ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కట్టియాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంటం శీరిష కృష్ణా రెడ్డి అన్నారు. ఆదివారం లాల్ గడి మలక్ పేట్ లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ ఆధ్వర్యంలో కైర పార్వతమ్మ -శంకరయ్యల నూతన ఇందిరమ్మ ఇల్లును అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శీరీష కృష్ణారెడ్డి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలతి మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, కైర గణేష్, జశ్వంత్ రెడ్డి, నాయకులు, తుంకి భిక్షపతి, మల్లేష్ యాదవ్, నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు



# కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్‌కు లేదు

- తెలంగాణ సాధనతోపాటు పదేళ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే
- ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి
- కులం పేరుతో విమర్శలు చేయడం సరికాదు: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నేత

**రంగారెడ్డి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు పదేళ్లపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ముందంజలో నిలిపిన మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, స్థాయిని మరిచి మాట్లాడటం రాజకీయ నాయకుల లక్షణం కాదన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదంటూ విమర్శించే ముందు రాజ్యాంగపరమైన నిబంధనలు, గతంలో పలువురు ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి హాజరుకాని సందర్భాలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా కులాన్ని ప్రస్తావిస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఫామ్‌హౌస్ నుంచి కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తారో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నటరాజన్, కౌన్సిలర్లు జి.టి. శ్రీనివాస్, గోపాల్, మహమ్మద్ ఎజాజ్, మాజీ కౌన్సిలర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు రవి యాదవ్, అశోక్, రాఘవేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఐ కిరణ్‌కుమార్ సస్పెన్షన్

**జగిత్యాల బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆర్ఐ అడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పోలీస్ సిబ్బందికి డ్యూటీల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు, కొంతమంది సిబ్బం దికి డ్యూటీలు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఆయనపై వచ్చినట్లు సమా చారం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు

# బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఫిర్యాదు

- సీఎం ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం
- బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేయాలని వినతి
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపణ





**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు అసత్య, అవమానకర ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం ఫొటోను మార్ఫింగ్ చేసి 'ఓటుకు నోటు' అంటూ సోషల్ మీడియాలో, బహిరంగంగా వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపేలా సాగుతున్న ఈ ప్రచారం పరువునష్టం కలిగించడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని అంజన్‌కుమార్ ఆరోపించారు. మార్ఫింగ్ చేసి ప్రచారం చేసిన వారితోపాటు కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మడుపు మోహన్, కార్పొరేటర్ వరాల నరసింగం, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కోళ్ల ఫారం మాటున కోడిపందాల బెట్టింగ్

- మన్నేగూడలో టాస్క్‌ఫోర్స్, ఆదిబట్ల పోలీసుల దాడి
- 22 మంది అరెస్ట్.. రూ.35 లక్షల సామగ్రి స్వాధీనం
- రూ.3.60 లక్షల నగదు, 31 కోడిపుంజులు పట్టివేత
- ప్రధాన నిర్వాహకుడు, భూ యజమాని పరారీ





**శంషాబాద్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కోళ్ల ఫారం మాటున కోడిపందాలు, పేకాటతో బెట్టింగ్ నిర్వహిస్తున్న జూదగృహాన్ని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఆదిబట్ల పోలీసులు ఛేదించారు. మన్నేగూడలోని ఆర్టీఓ కార్యాలయం వెనుక ఉన్న పాత కోళ్ల ఫారంపై శనివారం దాడి చేసి 22 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,60,510 నగదు, రూ.9.30 లక్షల విలువైన 31 లైవ్ బెట్టింగ్ కోడిపుంజులు, 146 కోడి కత్తులు, 20 సెల్‌ఫోన్లు, స్కోర్ నోట్‌బుక్స్, మూడు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. శంషాబాద్, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ కె.ఎస్.రావు పర్యవేక్షణలో, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి జూదగాళ్లను ప్రత్యేకంగా రప్పించి, భోజనం తదితర ఏర్పాట్లు చేసి కోడిపందాలు, పేకాట నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ప్రధాన నిర్వాహకుడు, భూ యజమాని పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కోడిపందాలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ సూచించారు. పరిసరాల్లో ఇలాంటి కార్యకలాపాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడిలో ఎస్ఐలు కె.మన్సూర్ అలీ, ఎన్.నరసింగరావు తోపాటు టాస్క్‌ఫోర్స్, ఆదిబట్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9న జాబ్ మేళా నిర్వహణ

### జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 06(జనంసాక్షి) :** సుభగృహ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం సెప్టెంబర్ 9వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ 233, పెద్దపల్లిలో సెప్టెంబర్ 09వ తేదీన ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సుభగృహ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ మేనేజర్స్, టెలీకాలర్స్ పోస్టులకు ఖాళీలు ఉన్నాయని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ మేనేజర్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ విద్యార్హత కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని, ఈ పోస్టులకు నెలకు రూ.15,000 నుంచి రూ.18,000 వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. టెలీకాలర్స్ పోస్టులకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ పోస్టులకు నెలకు రూ.15,000 వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 09వ తేదీన ఉదయం 10 గంటలకు తమ సీవీ/రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ జిరాక్స్ , అనుభవ ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 8985336947 ,8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నాటు బాంబులతో అడవి పందుల వేటకు యత్నం

- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- నిందితుల వద్ద మూడు నాటు బాంబులు స్వాధీనం
- పెంటాకుర్దు, అమ్దాపూర్ శివార్లలో పోలీసుల తనిఖీలు



**బోధన్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** అడవి పందులను వేటాడేందుకు నాటు బాంబులు అమర్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు తెలిపారు. ఆచన్‌పల్లికి చెందిన ద్యవనమైన మైసయ్య, మాసరొల్ల దత్తు, ఎరగాదిండ్ల గంగయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 4న పెంటాకుర్దు శివారులోని నాగోర ప్రాంతంలో పొలాల గట్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని స్థానికులు గుర్తించి ప్రశ్నించగా, అడవి పందుల కోసం నాటు బాంబులు అమర్చినట్లు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. దీనిపై రూరల్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. శనివారం సాయంత్రం అమ్దాపూర్ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని పోలీసులు గుర్తించగా.. వారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని తనిఖీ చేయగా కవర్‌లో మూడు నాటు బాంబులు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పేలుడు పదార్థాలను నిపుణుల పరిశీలనకు పంపించి, దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. నాటు బాంబులు, పేలుడు పదార్థాలు కనిపిస్తే వాటిని తాకకుండా, తరలించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హరుష్ ఘనత

- శివలింగాష్టకం 53 సెకన్లలో ఆలాపన
- సాధన స్కూల్ విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్
- హరుష్‌ను అభినందించిన పాఠశాల యాజమాన్యం




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కరీంనగర్ సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన నాలుగో తరగతి విద్యార్థి టి. హరుష్ ప్రతిష్టాత్మక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2026లో స్థానం సంపాదించాడు. శివలింగాష్టకం స్తోత్రాన్ని కేవలం 53 సెకన్లలో స్పష్టమైన ఉచ్చారణతో, ఎలాంటి తప్పులు లేకుండా ఆలపించి ఈ ఘనత సాధించాడు. చిన్న వయసులోనే జ్ఞాపకశక్తి, భక్తిశ్రద్ధలతో ప్రతిభ కనబరిచిన హరుష్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ మెడల్, సర్టిఫికెట్‌తో సత్కరించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా హరుష్ సాధించిన విజయం సాధన కుటుంబానికి గర్వకారణమన్నారు. అతడి విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ హరుష్, అతడి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హరుష్‌ను అభినందించారు.

# కేటీఆర్ ముందు యువతకు క్షమాపణ చెప్పాలి

### పదేళ్ల పాలనలో యువతకు జరిగిన అన్యాయాలపై సమాధానం చెప్పాలి

- సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు
- ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం సిద్ధం
- కరీంనగర్ యువ సమరభేరికి స్పందన లేదని విమర్శ



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత పదేళ్ల పాలనలో యువతకు జరిగిన అన్యాయాలపై ముందుగా సమాధానం చెప్పాలని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న డిమాండ్ చేశారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పేపర్ లీకేజీలు, 317 జీవో వంటి అంశాలపై యువతకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించి ఇప్పుడు యువత సమస్యలపై మాట్లాడటం సరికాదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని, ప్రజా సమస్యలపై ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపైనా సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన యువ సమరభేరికి ఆశించిన స్పందన రాలేదని, ఆ పార్టీపై ప్రజల్లో విశ్వాసం తగ్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యం ఇస్తోందని, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని నరసన్న తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు యువత సమస్యలను పట్టించుకోకుండా ఇప్పుడు ఆ అంశాలపై మాట్లాడటం రాజకీయ నాటకమని విమర్శించారు. గతంలో జరిగిన పరిణామాలపై యువతకు క్షమాపణ చెప్పిన తర్వాతే కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
07 సెప్టెంబర్ 2026




# వేదమ్మ పరిపూర్ణమైన వ్యక్తి

- ప్రొఫెసర్ హరగోపాల్
- జయప్రదమైన వేదమ్మ సంస్మరణ సభ



హైదరాబాద్ (జనంసాక్షి) : వేదమ్మ పరిపూర్ణమైన వ్యక్తి అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వేదమ్మ జ్ఞాపకాలతో సభ జరిగింది. సభకు అధ్యక్షత వేదమ్మ మనవరాలు స్వేచ్ఛ వహించింది. సభలో వేదమ్మ జ్ఞాపకాలతో ఉన్న పుస్తకం 'ఐదో తరగతి నుండి అనాటమి వరకు' (ఒక తల్లి వేదమ్మ జ్ఞాపకాలు) పుస్తకాన్ని వనమాల ఆవిష్కరించగా ప్రొఫెసర్ హర గోపాల్ పుస్తక పరిచయం చేశారు. పుస్తకావి ష్కరణ సభకు కొండల్ రెడ్డి అధ్యక్షత వహిం చారు. ఇందులో 48 మంది వేదమ్మతో తమ జ్ఞాపకాలను పంచుకొని రాసిన వ్యాసాలు ఉన్నాయి. హరగోపాల్ వేదమ్మా గురించి మాట్లాడుతూ ఆమె పరిపూర్ణమైన వ్యక్తి అన్నాడు. ఉద్యమాల్లో పనిచేసిన వారి సాహసా లు, చరిత్రను మాత్రమే మనం పుస్తకాలుగా తీసుకొస్తాం. కానీ వేదమ్మ ఒక్క మహిళగా ఉద్యమాల్లో పని చేసే వాళ్లకు ఎంత వీలైతే అంత సహాయ సహకారాలు అందించారు. వీళ్లు కూడా చరిత్రను సృష్టించారు. కావున ఇటువంటి వారి జీవితాన్ని రికార్డు చేయడం ఎంతో అవసరం అని ఆయన నొక్కి చెప్పాడు. ఈ పుస్తకాన్ని ముఖ్యంగా నేటి యువత చదివి, ఆమె ద్వారా నేర్చుకోవాల్సి అంశాలను తీసుకోవాలని సూచించాడు. వేదమ్మ జ్ఞాప కాలను కూతుళ్లు జ్యోతి విజయ, కొడుకు కొండారెడ్డి లతోపాటు మనవరాళ్ళు సమీర, శ్రీగుణ మనుమడు అభిరామ్, తమ అనుబం ధాన్ని పంచుకున్నారు. 86 సంవత్సరా లు గల వేదమ్మ తన కళ్ళను ఇవ్వడంతోపాటు గద్వాల్ మెడికల్ కాలేజీకి తన దేహాన్ని కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్గాన్ డొనేషన్ గురించి డాక్టర్ శ్రీ భూషణ్ రాజు, బాడీ డొనేషన్ గురించి బండి గిరిధర్, ఐ డొనేషన్ గురించి రామకృష్ణ మాట్లాడారు. చనిపోయిన తర్వాత కూడా మనం సమాజానికి ఎలా ఉపయోగపడగలమో అన్న విషయాల పట్ల అవగాహన కలిగించారు. 600 మంది పాల్గొన్న ఈ సభలో వేదమ్మ స్ఫూర్తితో నినాదాలతో సభ ముగిసింది.



# అక్టోబర్ 10, 11న జేవీవీ రాష్ట్ర మహాసభలు

- హైదరాబాద్‌లో నిర్వహణకు సన్నాహాలు
- ఆహ్వాన సంఘం చైర్మన్‌గా డా.బి.జనార్ధన్‌రెడ్డి,
- చీఫ్ ప్యాట్రన్‌గా ఎంపీ డా.మల్లురవి
- శాస్త్రీయ దృక్పథ విస్తరణకు మహాసభలు వేదిక



హైదరాబాద్ (జనంసాక్షి) : జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర ఆరో మహాసభలను అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం ప్రకటించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. బి.జనార్ధన్‌రెడ్డిని ఆహ్వాన సంఘం చైర్మన్‌గా, ఎంపీ డా.మల్లురవిని చీఫ్ ప్యాట్రన్‌గా నియమించినట్లు వెల్లడించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో ఆదివారం జరిగిన జేవీవీ రాష్ట్ర ఆరో మహాసభల సన్నాహక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్యాట్రన్లు, సలహాదారులుగా శాస్త్రవేత్తలు, వైద్యులు, ప్రొఫెసర్లు, సామాజికవేత్తలు, న్యాయవాదులు, పౌరసమాజ ప్రముఖులు, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీ డా.మల్లురవి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.రియాజ్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజారాజా, రచయిత్రి ఓల్గా, పద్మశ్రీ డా.దాసరి ప్రసాదరావు, శాస్త్రవేత్త డా.మెహతాబ్ ఎస్. బాम्झి తదితరులు మాట్లాడారు. ప్రజల్లో, ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, లింగ సమానత్వం వంటి అంశాలపై జేవీవీ మరింత విస్తృతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మూఢనమ్మకాలు, అవైజ్ఞానిక భావజాలం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలను విస్తరించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ, శాస్త్రీయ దృక్పథ వ్యాప్తి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం జేవీవీ ఉద్యమాన్ని గ్రామీణ ప్రాంతాలకు మరింత చేరువ చేయాలని సూచించారు. యువతను మద్యం, గుట్కా వంటి వ్యసనాల బారిన పడకుండా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని అభిప్రాయపడ్డారు. ప్రతి ఇంటి నుంచి సైన్స్ ఉద్యమం ప్రారంభ మైన టప్పుడే మూఢనమ్మకాలను పారదోల గలమని, అక్టోబర్ మహాసభలను శాస్త్రీయ చైతన్య ఉత్సవంగా నిర్వహించాలని సమావేశం లో నిర్ణయించారు. ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్లు ఎ.రామచం ద్రయ్య, బిఎన్ రెడ్డి, డా.అందె సత్యం, డా.కోయ వెంకటేశ్వర రావు, ఆర్.వరప్రసాద్, డా.పి.రజని, ఎం మమత, ఎం.శ్రీనివాస్, ఎస్.లింగస్వామి, ఎన్.శ్రీనివాసరావు, విమల, పి.నాగరాజు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# మూడు తరాల కవిత్వానికి ఒకే వేదిక

## ఒడిశా సాహిత్య ఉత్సవంలో 'పోయమ్స్ అక్రాస్ టైమ్' కవితా సంకలనం ఆవిష్కరణ



భువనేశ్వర్ (జనంసాక్షి) : ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల సాహిత్య స్వరాలను ఒకే సంకలనంగా తీసుకువచ్చిన అరుదైన ప్రయత్నం ఒడిశా సాహిత్య ఉత్సవంలో ఆవిష్కృతమైంది. 'పోయమ్స్ అక్రాస్ టైమ్ – వన్ ఫ్యామిలీ, త్రీ వాయిసెస్' పేరుతో రూపొందిన కవితా సంకలనాన్ని ఒడిశా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమథ్ పట్నాయక్ ఆవిష్కరించారు. ఈ సంకలనంలో ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల కవుల భావాలు, అనుభవాలు, ఆలోచనలు ప్రతిబింబించడం విశేషం. కాలం మారుతున్న కొద్దీ మనిషి ఆలోచనా విధానం, సామాజిక దృక్పథం, జీవితానుభవాల్లో వచ్చిన మార్పులను మూడు తరాల కవిత్వం ద్వారా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రముఖ కవి బి.పీ. ఆచార్య ఈ సంకలనాన్ని సంపాదించారు. ఆయనతో పాటు దివంగత డి.పీ. ఆచార్య, అన్షుమన్ ఆచార్య రచనలు ఇందులో చోటుచేసుకున్నాయి. తండ్రి, కుమారుడు, మనవడు తరాలకు చెందిన సాహిత్య స్వరాలు ఒకే సంకలనంలో కలవడం ఈ పుస్తకానికి ప్రత్యేకతను తీసుకువచ్చింది. సాహిత్యం కేవలం ఒక తరం భావాలను మాత్రమే ప్రతిబింబించదని, కుటుంబంలో తరతరాలుగా కొనసాగుతున్న ఆలోచనా వారసత్వాన్ని కూడా పదిలపరుస్తుందని ఈ సంకలనం చాటుతోంది. గత తరం అనుభవాలు, మధ్యతరం ఆలోచనలు, నూతన తరం దృక్పథాలు కవిత్వ రూపంలో ఒకచోట చేరడం పాఠకులకు భిన్నమైన అనుభూతిని అందించనుంది. ఒడిశా సాహిత్య ఉత్సవం వేదికగా ఈ సంకలనం ఆవిష్కృతం కావడం సాహిత్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. కార్యక్రమంలో రచయితలు, కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. మూడు తరాల సృజనాత్మక ప్రయాణానికి ఈ సంకలనం ఒక సాహిత్య సాక్ష్యంగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# తెలంగాణ తెచ్చుకోవడమే ఉద్యోగులకు శాపమా?

- స్వరాష్ట్రంలోనే ఉద్యోగుల సమస్యలకు బీజం
- ఉమ్మడి రాష్ట్రంలో పీఆర్సీ, డీఏలు పెండింగ్ లో లేవు
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఎందుకున్నాయో చెప్పాలి
- ఉద్యోగుల సంకల్ప సభను..హక్కుల సాధన సభగా మార్చుకుందాం
- పీఆర్సీ, ఓపీఎస్, డీఏలతో పాటు మరో 42 సమస్యల పరిష్కారమే జేఏసీ లక్ష్యం
- ఉద్యోగుల సంకల్ప సభలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగులకు మంచి పీఆర్సీలు, డీఏలు వస్తాయని, సమస్యలు తీరుతాయని ఆశించామని, స్వరాష్ట్రంలోనే తెలంగాణ ఉద్యోగుల సమస్యలు మొదలయ్యాయని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సకలజనుల సమ్మె చేసి తెలంగాణ తెచ్చుకోవడమే ఉద్యోగులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్ప సభ విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు ఈ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో పీఆర్సీ, డీఏలు పెండింగ్‌లో లేవని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఎందుకున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనేకసార్లు ఉద్యోగులతో చర్చలు జరిపారని, ఈ చర్చల్లో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. జూన్ 2న పీఆర్సీ నివేదిక తెప్పించుకొని, అమలు చేస్తామని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగడం లేదని, ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన పీఆర్సీ, డీఏ ఇవ్వాలంటే మాత్రం ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులపైనే వివక్ష, చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సభలు ఏర్పాటుచేసుకునే, ప్రభుత్వాన్ని అడిగే హక్కు, స్వేచ్ఛ ఉద్యోగ సంఘాలకు వచ్చిందని లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులకు దేశంలోనే ఆదర్శంగా ఉండేలా ప్రభుత్వం ఆరోగ్య పథకాన్ని తీసుకువచ్చిందని, అయితే, అమలులో మాత్రం లోపాలు ఉన్నాయని, వీటిని పరిష్కరించడంలో ఉన్నతాధికారులు చొరవ చూపించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని, ప్రభుత్వానికి మంచి పేరు తేవడంలో ఉద్యోగులు ఉపయోగపడతారని అన్నారు. తాము ప్రభుత్వాన్ని బెదిరించడం లేదని, ఉద్యోగుల పట్ల మానవీయకోణంలో ఆలోచించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. పదవీవిరమణ సమయంలో రావాల్సిన డబ్బులు రాకపోతే ఆ ఉద్యోగి పడే మానసిక వేదికను అర్థం చేసుకోవాలని అన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించేలా, పరిష్కరించేలా చేయడంతో పాటు ప్రజలకు అర్థం చేయించి, వారి మద్దతు పొందడమే ఉద్యోగుల సంకల్ప సభ లక్ష్యమని అన్నారు. 20–22 ఏళ్లుగా ప్రభుత్వంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొందరు ఉన్నతాధికారుల తప్పుడు సలహాలతో తొలగించారని, వారి కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

### ప్రజా ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతిస్తున్నాం..

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగుల కోసం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి అన్నారు. ఇదే సమయంలో ఉద్యోగులకు రావాల్సిన హక్కులను, మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నామని అన్నారు. హామీ ఇచ్చినట్టుగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను తీసుకురావాలని, వెంటనే పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. పీఆర్సీ, ఓపీఎస్, డీఏలతో పాటు మరో 42 సమస్యల పరిష్కారమే జేఏసీ లక్ష్యమని స్పష్టం చేశారు.

### ఉద్యోగులు సంఘటితం కావాలి:వొడ్నాల రాజశేఖర్

అంతకుముందు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ... సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉద్యోగులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల పక్షాన జేఏసీ పోరాటం చేస్తోందని, సమస్యల పరిష్కారానికి బాధ్యతగా, నిర్మాణాత్మకంగా పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం, విమర్శించడం తమ ఉద్దేశం కాదని, ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్చలకు పిలవడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ నాయకులు ఎస్.రాములు, మహిపాల్‌రెడ్డి, బాణాల రాంరెడ్డి, నిర్మల, రాధ, గరికె ఉపేందర్‌రావు, దర్శన్‌గౌడ్, కృష్ణుడు, అబీబుద్దీన్, కుమార్, చంద్రశేఖర్‌గౌడ్, సైదులు, రాధ, రమేష్ పాక, వి.భిక్షం, పెంటయ్య, అరికెల వెంకటేశం, ఉపేందర్‌రావు, బాలస్వామి, ఫూల్‌సింగ్, మల్లేష్, రామరాజు, శశిధర్‌రెడ్డి, భూమేష్, విజయ్, నర్సయ్య, శ్రీనివాసశంకర్, పులి లక్ష్మయ్య, రాబర్ట్ బ్రూస్, కుమార్, లక్ష్మణ్, మధు, ఆర్.తిరుపతి, తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ఆర్యవైశ్యుల సంక్షేమానికి అండగా ఉంటాం

- ఆర్యవైశ్యుల ఐక్యత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలి
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం అన్ని విధాలా అండగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కోతపేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన సంఘం కార్యవర్గ సభ్యులను అభినందించి, వారి సేవలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సమాజం ఎప్పటి నుంచో సేవా కార్యక్రమాలకు, ధార్మిక కార్యక్రమాలకు, సామాజిక సేవకు ముందుంటుందని అన్నారు. సమాజంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా సంఘాలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యవైశ్యులలో విద్యార్థులు, యువత, మహిళలు, వ్యాపారులు, ఉద్యోగులు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక ప్రోత్సాహం వంటి అంశాల్లో అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించేందుకు ముందుండాలని తెలిపారు. యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలి అని ఆయన అన్నారు. ఆర్యవైశ్య యువత విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. యువతను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ, సమాజ అభివృద్ధిలో వారి పాత్రను పెంచాలని చెప్పారు. మహిళలు కూడా సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందుకు రావాలని, మహిళా సాధికారతకు సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఐక్యతే సమాజానికి బలం అని ఆయన అన్నారు. ఆర్యవైశ్య సమాజం మరింత బలపడాలంటే అందరూ ఐక్యంగా ఉండాలని ఉప్పల శ్రీనివాస్ గుప్త పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలకు అతీతంగా సమాజ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేతయాలని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులు సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని, పేదలు మరియు అవసరంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఉప్పల శ్రీనివాస్ గుప్త స్పష్టం చేశారు. సమాజ అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొగ్గారపు దయానంద్, గుండా మల్లయ్య, నర్సింహులు గుప్తా, సురేందర్, ఎల్‌వీ కుమార్, డాక్టర్ రాజయ్య గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కరుణాకర్ చీకోటి, కార్యదర్శులు, సలహాదారులు, నూతన కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సమాజ సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి సంఘ అభివృద్ధి, సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.





Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370